## మండల స్థాయి ప్రతిభా పరీక్ష

పెండ్లిమర్రి, ఫిబ్రవరి 27, ప్రభాతవార్త:



మండలంలో మొట్టమొదటి సారిగా మండల విద్యాశాఖ ఆధ్వర్యంలో శుక్రవారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, వెల్లటూరు నందు మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో ప్రస్తుతం 5వ తరగతి చదువుతున్న విద్యార్థులకు మండల స్థాయి ప్రతిభా పరీక్ష నిర్వహించడం జరిగింది. ఇందులో మెరుగైన ప్రతిభ కనబరిచి మొదటి బహుమతి తిప్పిరెడ్డిపల్లి ఎంపీపీఎస్ విద్యార్థి సాహితీరెడ్డి, 2వ బహుమతి ఎం.పార్థు, 3వ బహుమతి సిదాసరిపల్లి ఎంపీపీఎస్ విద్యార్థి చెంచురెడ్డిగారి కీర్తిలు గెలుపొందారు. కడప ఉప విద్యాశాఖాధికారి రాజగోపాల్‌రెడ్డి పాల్గొని కార్యక్రమం నిర్వహణపై అలాగే గెలుపొందిన విద్యార్థులను ఆయన అభినందించారు. మండలంలో ప్రతిభను వెలికి తీయడానికి ఇటువంటి కార్యక్రమం నిర్వహించడం చాలా సంతోషంగా ఉందని ఈ కార్యక్రమ విజయానికి సహకరించిన సహాయ సహకారాలు అందించిన ప్రజా ప్రతినిధులకు, ప్రతిభా పరీక్ష నిర్వహణ కమిటీ ప్రతినిధులకు, ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులకు, మండలంలోని ఉపాధ్యాయులందరికీ ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో ఎంఈవోలు సుజాత, గంగాధర్‌నాయక్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## 100 శాతం పన్నులు వసూలు చేయాలి

దువ్వూరు, ఫిబ్రవరి 27, ప్రభాతవార్త:

మండలంలోని 23 గ్రామ పంచాయతీల్లో పంచాయతీ కార్యదర్శులు మార్చి 15లోగా 100శాతం ఇంటి, నీటి పన్నులను వసూలు చేయాలని ఎంపీడీవో సుబ్బారెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రమైన దువ్వూరులో సర్పంచ్ చంద్రాయుడుతో కలిసి వీధుల్లో తిరిగి ప్రజలకు పన్ను వసూళ్లపై చైతన్యం కల్పించారు. ఈ సందర్భంగా పలువురు ఇళ్ల వద్దకు వెళ్లి ఇంటి పన్ను వసూలు కూడా చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఇంటి, నీటి పన్నులు ప్రజలు చెల్లిస్తే పంచాయతీల్లో అభివృద్ధి పనులు చేపట్టే అవకాశం ఉంటుందని అందువల్ల ప్రతి ఒక్కరూ పన్నులు చెల్లించాలని కోరారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## పింఛన్లు పంపిణీకి ఏర్పాట్లు

దువ్వూరు, ఫిబ్రవరి 27, ప్రభాతవార్త:

మండలంలోని 15 గ్రామ సచివాలయాల పరిధిలో శనివారం పింఛన్లు పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఎంపీడీవో సుబ్బారెడ్డి తెలిపారు. మార్చి 1వ తేదీ ఆదివారం అయినందున ఫిబ్రవరి 28వ తేదీనే ఒక రోజు ముందుగా పెన్షన్‌లు పంపిణీ చేస్తున్నామన్నారు. మండలంలో 7099 పింఛన్లు ఉండగా వీటికి 3 కోట్ల 25 లక్షల రూపాయలు సచివాలయ సిబ్బందికి అందజేసినట్లు తెలిపారు. మండలంలో 128 మందిని పిన్షన్ పంపిణీకి ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. లబ్ధిదారులు వద్దనే ఉండి పింఛన్లు తీసుకోవాలని కోరారు.

## మురికి కాలవల్లో చెత్తాచెదారం తొలగింపు..

యర్రగుంట్ల ఫిబ్రవరి 27, ప్రభాతవార్త:



పట్టణ పరిధిలోని సుందరయ్యనగర్‌లో మురుగు కాలువల్లో పేరుకుపోయిన చెత్తా,చెదారాన్ని శుక్రవారం యర్రగుంట్ల మున్సిపల్ సిబ్బంది మురికి కాలవలను శుభ్రం చేశారు. కొన్ని నెలలుగా శుభ్రం చేయకపోవడంతో చెత్తాచెదారం నిండిపోయి అపరిశుభ్రంగా మారడంతో దోమలు వ్యాప్తి చెందాయి దీంతో ప్రజలు జ్వరాల బారిన పడుతున్నారని స్థానిక ప్రజలు టిడిపి నాయకుడు తుంగ వెంకట మోహన్ కి మొరపెట్టుకోగా ఆయన మున్సిపల్ కమిషనర్ శేష ఫణి దృష్టికి తీసుకెళ్లడంతో త్వరితగిన స్పందించి మున్సిపల్ సిబ్బందితో కాలువలను శుభ్రం చేయించారు. దీంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో శానిటేషన్ సిబ్బంది రవి, రమేష్, టిడిపి నాయకుడు సంజీవ్ తదితరులు పాల్గొన్నారు.

## అధికారులతో డిప్యూటీ ఎంపీడీవో సమీక్ష

నిమ్మనపల్లి ఫిబ్రవరి 27 ప్రభాతవార్త



మండలంలో ఉన్న అందరూ పంచాయతీ అభివృద్ధి అధికారులుతో డిప్యూటీ యంపిడివో బాలరాజు సమీక్షిస్తూ ఇంటి పన్నులు పన్నేతరములు వసూలు సకాలంలో లక్ష్యం సాధించాలని, ప్రగతి లేని గ్రామ పంచాయతీలకు అదనంగా సిబ్బందిని కేటాయించి లక్ష్యాలు కేటాయించి. .ప్రతి ఇంటి యజమాని ఇంటికి రెండు మూడు విడతలు తిరిగి.. కేటాయించిన సిబ్బందితో సంబందించిన పీడివో వారు సమన్వయము చేసికొని స్వర్ణ పంచాయతీ ద్వారా యాజమాన్యం నుండి చెల్లింపులు చేయించి.. ప్రతి 2 గంటలకు ఒకసారి నివేదిక ఇవ్వండని కోరారు. ప్రతి రోజు టెలీ కాన్ఫరెన్స్ లో ఆదేశించిన ఉత్తర్వులు, డీపీవో, డీడీవో, డీయల్పివో వారలు సూచనలు యదాతదంగా వివరిస్తూ.. నిరక్ష్యం చేయక అందరూ సహకరించాలన్నారు. అవసరం అయితే నా సహకారం తీసుకోవాలని తెలిపారు.. ఇందులో ఎటువంటి నిరక్ష్యం చేయరాదని, ఉన్నతాధికారుల ఉత్తర్వులు మేరకు అందరూ విధులు నిర్వర్తించాలని ఆదేశించారు.

## మార్చి మూడవ తేదీన ఆలయం మూత

రాయచోటి ఫిబ్రవరి 27 ప్రభాతవార్త

మార్చి మూడవ తేదీన ( మంగళవారం)ముచ్యమానోదయ చంద్ర గ్రహణ ఏర్పడడం వలన అన్నమయ్య జిల్లా రాయచోటి పట్టణంలోని శ్రీ భద్రకాళి శ్రీ వీరభద్ర స్వామి ఆలయాన్ని మూసివేస్తున్నట్లు ఆలయ చైర్మన్ మనోజ్ కుమార్, ఆలయ ఈ.ఓ డివి రమణారెడ్డిలు తెలిపారు. వారు మాట్లాడుతూ:శ్రీ విశ్వావసు నామ సంవత్సర ఫాల్గుణ శుద్ధ పూర్ణిమ మంగళవారమునకు సరియగు 3.03.26వ తేది పుబ్బా నక్షత్ర యుక్త కేతుగ్రస్త ముచ్యమానోదయ చంద్రగ్రహణమ్ ఏర్పడడం వలన ఆలయాన్ని మూసివేస్తున్నట్లు వారు తెలిపారు. కాలమాన ప్రకారం :గ్రహణ స్పర్శ కాలము ప 03.23గ్రహణ మధ్య కాలము సా 05.06గ్రహణ మోక్ష కాలము సా 06.49సదరు చంద్రగ్రహణం సందర్భంగా ఉదయం 9 గంటల నుండి రాత్రి 7:30 వరకు దేవాలయం తలపులు మూసి ఉంచబడును. ఈ సమయమున స్వామి వారి దర్శనము, సేవలు ఉండవు. రాత్రి 7:30 నిమిషాల తరువాత ఆలయమును శుద్ధి,పుణ్యాహవాచనము, స్వామి వారికి విశేష అభిషేకం చేసిన తరువాత భక్తులకు దర్శనము, తీర్థప్రసాద వితరణ జరుపబడునని వారు తెలియజేశారు.

## రాకెట్ సంస్థపై ఫిర్యాదు

పులివెందుల , ఫిబ్రవరి 27, ప్రభాత వార్త :



పులివెందుల పట్టణంలో గత ప్రభుత్వ కాలంలో చేపట్టిన హౌసింగ్ గృహ నిర్మాణ పనులకు సంబంధించి రాకెట్ సంస్థపై ఫిర్యాదు చేసినట్లు గృహ నిర్మాణ సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ రాజా రత్నం తెలిపారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఈ ఫిర్యాదు నమోదు చేసినట్లు ఆయన వెల్లడించారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ పులివెందుల పట్టణ పోలీస్ స్టేషన్‌లో కేసుకు సంబంధించిన పత్రాలను పట్టణ సీఐ సీతారామిరెడ్డికి అధికారికంగా అందజేసినట్లు పేర్కొన్నారు. ప్రభుత్వం మారిన తర్వాత రాకెట్ సంస్థ గృహ నిర్మాణ పనులను మధ్యలోనే నిలిపివేయడంతో లబ్ధిదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఈ నేపథ్యంలో లబ్ధిదారుల నుంచి వచ్చిన ఫిర్యాదుల ఆధారంగా, ఉన్నతాధికారుల సూచనలతో జిల్లా కలెక్టర్ ద్వారా అధికారికంగా ఫిర్యాదు చేయడం జరిగిందన్నారు. అసంపూర్తిగా ఉన్న ఇళ్ల నిర్మాణం వల్ల అనేక కుటుంబాలు ఇబ్బందులు పడుతున్నాయని, బాధితులకు తగిన న్యాయం చేయడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని రాజా రత్నం స్పష్టం చేశారు. కేసుకు సంబంధించిన దర్యాప్తు కొనసాగుతోందని, బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. లబ్ధిదారుల హక్కులను కాపాడడం తమ ప్రధాన లక్ష్యమని, ప్రభుత్వం తరఫున అన్ని విధాల సహకారం అందిస్తామని ఆయన హామీ ఇచ్చారు.

## ఆర్యవైశ్య ఫెడరేషన్ నూతన కమిటి ఎన్నిక

: జిల్లా వైస్ ప్రెసిడెంట్‌గా దేవతి లలిత

బద్వేలు అర్బన్ ,ఫిబ్రవరి27, ప్రభాతవార్త :



ఇంటర్నేషనల్ ఆర్యవైశ్య ఫెడరేషన్ కడప జిల్లా మహిళా విభాగ్ ఉపాధ్యక్షురాలుగా బద్వేలు పట్టణానికి చెందిన వైస్ ప్రెసిడెంట్‌గా దేవతిలలిత, దేవతి లక్ష్మీదేవి జాయింట్ సెక్రటరీ, జాయింట్ ట్రెజరర్‌గా చింతకుంట ధనలక్ష్మిలను నియమించినట్లు ఐవీఎఫ్ కడపజిల్లా మహిళా అధ్యక్షురాలు కోటా జ్యోతి తెలిపారు. ఈ సందర్బంగా నూతనంగా ఎన్నికైన లలిత, లక్ష్మీదేవి, ధనలక్ష్మిలకు పలువురు అభినందనలు తెలిపారు. ఈ సందర్బంగా వైస్ ప్రెసిడెంట్‌గా ఎన్నికై లలిత మాట్లాడుతూ తాను మహిళా మండలి అధ్యక్షురాలిగా,కడపజిల్లా ఆర్యవైశ్య మహిళా మండలి సెక్రటరీగా అనేక సంవత్సరాలు సేవలందించడం జరిగిందని తమ సేవలను గుర్తించి ఐవీఎఫ్ వైస్ ప్రెసిడెంట్‌గా ఎన్నుకోవడంతో తమ బాధ్యత మరింత పెరిగిందన్నారు. కడపజిల్లా స్థాయిలో మహిళలకు ఎవరికి ఏ సమస్యలు వచ్చినా తాను ఎల్లవేళలా అందుబాటులో ఉంటానని, నిరుపేద వైశ్యులకు అవసరమైన సేవలందిస్తామన్నారు. మార్చి 8వ తేదిన నిర్వహించబోయే అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహించి పలువురి సేవలను గుర్తించి అభినందించడం జరుగుతుందన్నారు.

## మార్చిలోగా గృహ నిర్మాణాలను పూర్తి చేయాలి

దువ్వూరు, ఫిబ్రవరి 27, ప్రభాతవార్త:



మండల కేంద్రమైన దువ్వూరుకు సమీపంలో క్రీస్తు రాజుపురం వద్ద ఉన్న గృహ నిర్మాణ శాఖ కాలనీలో ఉన్న ఇళ్ల నిర్మాణాన్ని మార్చిలోగా పూర్తి చేయాలని గృహ నిర్మాణ శాఖ ప్రత్యేక అధికారి, జనరల్ మేనేజర్ వెంకట రమణ అన్నారు. శుక్రవారం కొండపైన నిర్మిస్తున్న గృహాలను ఆయన పరిశీలించారు. అనంతరం లబ్ధిదారుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కాలనీలో మౌలిక వసతులు ఉన్నాయా లేదా, ఎందుకు లబ్ధిదారులు నిర్మించుకోవడం లేదని వారితో చర్చించారు. ఈ కాలనీ నందు 233 గృహాలు కేటాయించగా 113 పూర్తి చేశారని, ఇంకా 120 గృహాలు పూర్తి కావలసి ఉందన్నారు. వీటిని మార్చి 30వ తేదీలోగా పూర్తి చేసే విధంగా గృహ నిర్మాణశాఖ అధికారులు పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారి రాజారత్నం, డిఈ రమేష్ బాబు, సిబ్బంది, లబ్ధిదారులు పాల్గొన్నారు.

## టిడిపి తీర్థం పుచ్చుకున్న ఇద్దరు వైసిపి కార్పొరేటర్లు

కడప కార్పొరేషన్ ఫిబ్రవరి 27 ప్రభాతవార్త:



కడప వైసిపి కార్పొరేటర్‌లు సానపురెడ్డి శివకోటిరెడ్డి (12 డివిజన్), రామ లక్ష్మణ్ రెడ్డి (13 డివిజన్) టిడిపి తీర్థం పుచ్చుకున్నారు. ఈ మేరకు శుక్రవారం రాజధాని అమరావతి సచివాలయంలో ప్రభుత్వ విప్, కడప ఎమ్మెల్యే మాధవి రెడ్డి, టిడిపి పోలీస్ బ్యూరో సభ్యులు రెడ్డప్పగారి శ్రీనివాసులు రెడ్డిలతో కలిసి ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు కలిశారు. కడప నగర అభివృద్ధిలో భాగస్వాములు అవుతున్నందుకు కార్పొరేటర్లను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అభినందించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్లు మాట్లాడుతూ నగరంలోని ప్రజా సమస్యలు, అభివృద్ధిపై ముఖ్యమంత్రితో చర్చించి, క్షేత్రస్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేస్తామని పేర్కొన్నారు. సీఎం ను కలిసిన వారిలో నాగేంద్రారెడ్డి ఉన్నారు.

## జేసీ చైర్మన్‌గా జె.రామసుబ్బయ్య యాదవ్ ఏకగ్రీవ ఎన్నిక

ప్రొద్దుటూరు అర్బన్,ఫిబ్రవరి 27, ప్రభాత వార్త



రాష్ట్ర, జిల్లా జేఏసీ ఆదేశానుసారం శుక్రవారం ప్రొద్దుటూరు ఎన్జీజీవోస్ హోం నందు తాలూకా జేఏసీ కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఉద్యోగులు, ఉపాధ్యాయులు, ఆర్టీసీ, పెన్షనర్లు, నాల్గవ తరగతి ఉద్యోగులు మరియు సచివాలయ ఉద్యోగులు పాల్గొని ఉద్యోగుల సమస్యల పైన చర్చించారు. ఈ చర్చలో పిఆర్సి కమిషన్‌ను నియమించాలని పెండింగ్ డీఏ మరియు సరెండర్ లీవ్ బకాయిలను మంజూరు చేసే విధంగా రాష్ట్ర జేఏసీ, జిల్లా జెఏసి నాయకత్వానికి ఈ వేదిక ద్వారా కోరారు. సమావేశంలో పాల్గొన్న నాయకులు అందరూ ఐఖ్యతతో స్పందించి రాష్ట్ర జేఏసీ చైర్మెన్ ఏ. విద్యా సాగర్ కి మరియు సెక్రటరీ జనరల్ యన్. ప్రసాద్ కి, జిల్లా జెఏసి చైర్మన్ బి.శ్రీనివాసులు, జెఏసి సెక్రటరీ జనరల్ పి.మహేష్ బాబు నాయకత్వంలో ఆర్థికపరమైన మరియు ఆర్థికేతర అంశాలను సాధించుకొనే దిశగా ముందుకు వెళ్ళగలమని వివరించారు. తదుపరి తాలూకా జేఏసీ కార్యవర్గాన్ని ఏర్పాటు చేశారు. ప్రొద్దుటూరు తాలూకా జేఏసీ చైర్మన్ గా జె.రామ సుబ్బయ్య యాదవ్ కన్వీనర్ గా ఇ. ప్రమీల, కోచైర్మెన్స్ డి. సలీం (ఎస్టీయు), వి వి.శ్రీనివాసుల రెడ్డి (ఏపీటీఎఫ్), డి .గోపాల్ బి. దస్తగిరి రెడ్డి, రవీంద్రుడు, రమణ, కో కన్వీనర్స్ సి .సదాశివయ్య, ట్రెజరర్ కె.ఓంకార్, డి వేణుగోపాల్ రెడ్డి, సుబ్బారెడ్డి, యం.విజయ ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో అసోసియేట్ ప్రెసిడెంట్ అశోక్ కుమార్, వైస్ ప్రెసిడెంట్ వరప్రసాద్, సచివాలయం ప్రెసిడెంట్ కె. పేరయ్య, మహిళా విభాగం చైర్మన్ అరుణ దేవి కన్వీనర్ యన్. విజయేశ్వరి మరియు ఉద్యోగులు, పెన్షనర్స్ పాల్గొన్నారు.

## వైష్ణవీమాతకు పంచామృతాభిషేకం

చౌడేపల్లి, ఫిబ్రవరి 27 ప్రభాతవార్త

పుదిపట్ల స్వయంభు వైష్ణవీమాతా ఆలయంలో అమ్మవారికి ఆలయ ప్రధానార్చకురాలు శ్రావణీ ఆధ్వర్యంలో ఉదయాన్నే పంచామృతాభిషేకం, ప్రాంగణంలోని అభయాంజనేయస్వామి, నాగభైరవులకు విశేషాభిషేకాలు అలంకరణలు గావించారు. వివిధ ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చి అమ్మవారికి ముడుపులు చెల్లించారు. పలమనేరు మండలం ఏడూరు సుబ్బరత్నమ్మ, వెంకట్రమణారెడ్డిలు ఉభయదారులుగా వ్యవహరించారు. ఆలయ నిర్మాణకర్త వినోద్‌కుమార్‌రెడ్డి భక్తులకు తీర్థ ప్రసాదాలందించారు.

## పులికోనవంకలో క్షుద్రపూజల కలకలం

చౌడేపల్లి, ఫిబ్రవరి 26 ప్రభాతవార్త



గ్రామానికి వెళ్ళే మార్గంలో పలు రకాల పుష్పాలు…రక్తంతో కూడిన నిమ్మకాయలు చుట్టూ ముగ్గులు ఇలాంటివి గ్రామస్తులను భయాందోళనకు గురి చేస్తున్నాయి. గ్రామస్తుల కథనం మేరకు…మండలంలోని ఆమినిగుంట పంచాయతీ యానాదులు నివసించే పులికోనవంకలో ఈ పరిస్థితి నెలకొని వుంది. చౌడేపల్లి–తిరుపతి ప్రధాన రహదారి శింగిరిగుంటకు సమీపంలో పులికోనవంక వెళ్ళే మార్గంలో గుర్తు తెలియని వ్యక్తులు క్షుద్రపూజలు చేస్తున్నారని గ్రామస్తులంటున్నారు. గత రెండు నెలలుగా ఇదే తంతు జరుగుతోందన్నారు. ఊరి ముందరే కాకుండా ఆవలి వైపుసైతం రెండు చోట్లా పూజలు చేస్తున్నారని వాపోయారు. పిల్లలు, వృద్ధులు బయటకు రావాలంటేనే భయపడుతున్నారని తెలుపుతున్నారు. పగలంతా పనులకు వెళ్ళి రాత్రిళ్ళు ఇంట్లో వుండగా, గ్రామానికి సమీపంలో ఈ పనులకు పాల్పడుతున్నారనీ, వారి నుంచి రక్షించాలని యానాదులు కోరుతున్నారు.

## బ్రహ్మోత్సవ ఆహ్వానం

రామసముద్రం పిబ్రవరి 27 ప్రభాతవార్త

దిగువపేటలో కొలువైన శ్రీ ప్రసన్న పార్వతీ సమేత చంద్రశేఖర స్వామి వారి బ్రహ్మోత్సవాలు స్వస్తిశ్రీ విశ్వావసునామ సంవత్సరం ఫాల్గుణమాసం శుద్ధ ద్వాదశి ఈ నెల 28శనివారం నుంచి పాల్గుణ మాసం బహుళచవితి మార్చి 7 వతేదీ వరకు రథోత్సవాలు వైభవంగా నిర్వహించడం జరుగుతుందని ఆలయ ప్రధాన అర్చకులు బాలా స్వామి తెలియజేశారు. మార్చి 3న రథోత్సవం ప్రధాన ఆకర్షణలని అనంతరం స్వామివారికి వసంతోత్సవం, గ్రామోత్సవం నిర్వహించి శయనోత్సవంతో ముగింపు అవుతుందన్నారు.

## ఘనంగా జనసేన సభ్యత్వ నమోదు

వేంపల్లి:ఫిబ్రవరి 27(ప్రభాత వార్త )



మూడు రోడ్ల కూడాలిలో జనసేన సభ్యత్వ నమోదు కార్యక్రమం మొదలయింది ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిదిగా జనసేన అనంతపురం జిల్లా అధ్యక్షులు, అహుడా చైర్మెన్ వరుణ్ మరియు రాష్ట్ర కార్యదర్శి తాతమాశెట్టి నాగేంద్ర, కడప జిల్లా నాయకులు జి.వి.రమణ పాల్గొన్నారు, కార్యక్రమంలో జనసేన సమన్వయకర్త డా.హరిష్ మాట్లాడుతూ రాష్ట్రము లోనే అత్యధికముగా సభ్యత్వ నమోదు పులివెందుల నుంచే జరగాలని పిలుపునిచ్చారు, ఈ కార్యక్రమానికి నియోజకవర్గ పరిదిలోని అన్ని మండలాల జనసైనికులు పాలుపంచుకున్నారు, ముఖ్యలుగా ఈడపులపాయ జయచంద్ర, లక్ష్మణ్, దేవా, మనోజ్, శ్యాం, నాగేంద్ర, సుదీర్ రెడ్డి, మార్కెట్ యార్డ్ డైరెక్టర్ మల్లికార్జున, నాగులాగుట్ట పల్లె నాగమల్లయ్య, మొదలగు నాయకులు పాల్గొన్నారు..

## ముఖ్యమంత్రి వ్యాఖ్యలు హాస్యాస్పదం, అవాస్తవం

వేంపల్లె ఫిబ్రవరి 27 (ప్రభాతవార్త)

రాష్ట్రంలో సాగునీటి ప్రాజెక్టులన్నీ తమ హయాంలోనే అంటే టిడిపి,ఎన్ డి ఏ హయంలోనే నిర్మించబడ్డాయని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అసెంబ్లీ సాక్షిగా చెప్పడం హాస్యాస్పదం, అవాస్తవమని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మీడియా చైర్మన్ డాక్టర్ నర్రెడ్డి తులసి రెడ్డి అన్నారు. ఆంధ్రప్రదేశ్ అన్నపూర్ణగా పిలువబడేటందుకు ప్రధాన కారణం శ్రీశైలం రిజర్వాయర్, నాగార్జున సాగర్ ప్రాజెక్ట్,ప్రకాశం బ్యారేజ్, ధవలేశ్వరం బ్యారేజ్. పై ప్రాజెక్టులన్ని కాంగ్రెస్ హయాంలోనే నిర్మించబడ్డాయి. అప్పటికీ తెలుగుదేశం పార్టీ పుట్టనేలేదు. పై ప్రాజెక్టులు కూడా తామే నిర్మించామని చంద్రబాబు చెప్పడం విడ్డూరమన్నారు. ఇకనైనా అబద్దాలు చెప్పడం మానుకొని సాగునీటి ప్రాజెక్టులపై ప్రత్యేక శ్రద్ధ వహించి నిర్దిష్ట కాల వ్యవధిలో ప్రణాళికాబద్ధంగా పూర్తి చేసి రైతులను ఆదుకోవాలని తులసి రెడ్డి సూచించారు.

## డాక్టర్ నాగదస్తగిరిరెడ్డి కి మద్దతివ్వాలి

ప్రొద్దుటూరు అర్బన్, ఫిబ్రవరి 27, ప్రభాత వార్త



మార్చి 3న జరిగే ప్రొద్దుటూరు రెడ్ల సేవా సంఘం ఎన్నికలలో డాక్టర్ నాగదస్తగిరిరెడ్డి కి మద్దతివ్వాలని కడప రెడ్ల సేవా సంఘం ప్రధాన కార్యదర్శి, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రెడ్డి సేవా సంఘాల సమాఖ్య ప్రధాన కార్యదర్శి లెక్కల కొండారెడ్డి తెలిపారు. శుక్రవారం స్థానిక శ్రీరాములపేటలోని కళ్యాణ చక్రవర్తి హాస్పిటల్ నందు ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నాగదస్తగిరిరెడ్డి రెడ్ల సేవా సంఘం, కళ్యాణ మండపం అభివృద్ధికి కృషి చేశారని, భవిష్యత్తులో కూడా ఈ పరిస్థితి కొనసాగాలంటే ఆయనను గెలిపించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రెడ్డి సేవా సంఘాల సమాఖ్య కోశాధికారి సుబ్బారెడ్డి, డాక్టర్ నాగదస్తగిరిరెడ్డి ప్యానెల్ సభ్యులు కొవ్వూరు రమేష్ రెడ్డి, గంగిరెడ్డి మాధవరెడ్డి పాల్గొన్నారు.

## రైల్వే స్టేషన్‌కు వాటరింగ్ పాయింట్ ప్రతిపాదన

నందలూరు, ఫిబ్రవరి 27 ప్రభాతవార్త:



నందలూరు రైల్వే స్టేషన్‌లో వాటరింగ్ పాయింట్ ఏర్పాటు చేయాలని దక్షిణ కోస్తా రైల్వే ఓఎస్డి చంద్రశేఖర్‌ను విశాఖపట్నంలో కలిసి కోరినట్లు రైల్వే స్టేషన్ కన్సల్టేటివ్ మెంబర్ రాచూరి మురళి తెలిపారు. స్టేషన్‌కు సమీపంలో బహుదా నది పరివాహక ప్రాంతానికి చెందిన చెయ్యేరు నది ప్రవహిస్తోందని, అక్కడ స్వచ్ఛమైన నీరు లభ్యమవుతుండటంతో చెన్నై, ముంబై సహా సుదూర ప్రాంతాలకు వెళ్లే రైళ్లకు నీటి సరఫరా సౌకర్యం కల్పించవచ్చని సూచించారు. ప్రాచీనమైన మరియు విస్తీర్ణం కలిగిన రైల్వే స్టేషన్‌కు ప్రస్తుతం ప్రధాన రైళ్ల నిలుపుదలలు లేకపోవడం పట్ల విచారం వ్యక్తం చేశారు. హైదరాబాద్, చెన్నై నగరాలకు వెళ్లే రైళ్లకు ఇక్కడ నిలుపుదల కల్పించాలని విజ్ఞప్తి చేశారు. వినతిపై స్పందించిన ఓఎస్డి చంద్రశేఖర్ ప్రతిపాదనను పరిశీలించి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు మురళి పేర్కొన్నారు.

## మండల విద్యాధికారిచే పరీక్ష సామాగ్రి పంపిణి

సుండుపల్లె, పిబ్రవరి27, ప్రభాతవార్త :



మండల పరిధిలోని జిల్లా పరిషద్ పాఠశాల రాయవరంలో చదువుచున్న విద్యార్థులకు 27 వ తేదీ శుక్రవారం ఒకో విద్యార్థికి రైటింగ్ ప్యాడ్ మొదలగు పరీక్ష సామాగ్రి డితాడు గ్రామం బాలిరెడ్డిగారిపల్లిలో పని చేస్తున్న ఉత్తమ ఉపాధ్యాయుడు నంద్యాల. వెంకటసిద్దయ్య (ఎస్జీటీ ), మండలవిద్యాధికారి(2) రవీంద్ర నాయక్ చేతులు మీదుగా ఇవ్వడం జరిగిందని ఆయన తెలియజేసారు.ఈ సందర్భంగా ఏంఇఒ మాట్లాడుతూ విద్యార్థులకు విద్యాపరంగా గుణాత్మక విద్యను నైతికవిలువలను అందిస్తూ సమాజానికి మేలుచేసే పనులు చేస్తూ అందరి ఉపాధ్యాయులకు ఆదర్శంగా నిలుస్తున్నారని కొనియాడారు. వెంకట సిద్దయ్య మాట్లాడుతూ 300 మంది విద్యార్థులకు దాదాపు 60 వేలు ఇవ్వడం జరిగిందని తెలియజేసారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు అమ్మనాయక్,పాఠశాల సిబ్బంది, తల్లి దండ్రులు పాల్గొన్నారు.

## సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణి

ప్రొద్దుటూరు అర్బన్, ఫిబ్రవరి 27 ప్రభాతవార్త



ఎమ్మెల్యే నంద్యాల వరదరాజుల రెడ్డి స్థానిక నెహ్రూరోడ్డు లోని తెలుగుదేశంపార్టీ కార్యాలయంలో శుక్రవారం నియోజకవర్గానికి సంబంధించిన 53 మంది లబ్ధిదారులకు 54.81 లక్షల రూపాయల 24 వ విడత ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను ఆయన లబ్ధిదారులకు పంపిణీ చేశారు. అర్హతే ప్రామాణికంగా, కులమతాలకు, రాజకీయాలకు తావు లేకుండా అర్హులైన ప్రతి పేదవాడిని ఆదుకోవడమే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ధ్యేయమన్నారు. ఆపదలో ఉన్న వారికి అండగా, కష్టాల్లో ఉన్న ప్రతి పేదవాడికి అండగా ఉంటూ, వారికి భరోసా కల్పించడమే మా ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ బచ్చల పుల్లయ్య, రాష్ట్ర విశ్వ బ్రాహ్మణ సంక్షేమ డైరెక్టర్ శ్రీనివాసాచారి, టిడిపి పట్టణ అధ్యక్షుడు చల్లా రాజగోపాల్ యాదవ్, టిఎన్టీయుసి జిల్లా అధ్యక్షులు చింతకుంట కుటుబుద్దీన్ , మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ మారుతి ప్రసాద్ రెడ్డి, మాజీ మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ మల్లిఖార్జున, మాజీ కౌన్సిలర్లు సూర్యనారాయణ రెడ్డి, తలారి పుల్లయ్య, సోమా బాలయ్య, గంజికుంట ఆంజనేయులు, టిడిపి పట్టణ కార్యదర్శి రాజా, సాన శివనాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## హిందూ స్మశాన వాటికకు నిధులు

రాజంపేట, ఫిబ్రవరి 27 ప్రభాతవార్త



మండలపరిధిలోని కారంపల్లి పంచాయితీలో హిందూ స్మశానవాటికలో అభివృద్ధి పనుల కోసం ఐదు లక్షల మండల పరిషత్ నిధుల నుంచి మంజూరయ్యాయి. ఈ నిధులతో సబ్మెర్సిబుల్ బోరుతోపాటు, ఇతర మౌలిక సదుపాయాలు కల్పించేందుకు ఖర్చు చేస్తున్నారు. అందులో భాగంగా శుక్రవారం స్మశాన వాటికలో భూమి పూజ చేసి బోర్ పనులను ప్రారంభించారు. ఇప్పటికే హిందూ స్మశాన వాటిక అభివృద్ధి కోసం ఎంప్రేడా మైనింగ్ కంపెనీ ఎండి ఆకేపాటి విక్రమ్ రెడ్డి 10 లక్షలు అందజేయగా స్మశాన వాటిక చదును పనులు చేశారు. వైసీపీ రాజ్యసభ సభ్యులు మేడా రఘునాథరెడ్డి తన నిధుల నుంచి పది లక్షలు ప్రహరీ గోడ కోసం కేటాయించారు. తాజాగా మండల పరిషత్ నుంచి ఎంపీపీ ఆకేపాటి రంగారెడ్డి ఐదు లక్షలు నిధులు కేటాయించడంతో పనులు ప్రారంభించారు. స్మశాన వాటికి అభివృద్ధి కోసం నిధులు కేటాయించిన ఆకేపాటి రంగారెడ్డికి ఆకేపాటి మురళి రెడ్డికి శ్రీ కాశి విశ్వనాథ స్మశాన అభివృద్ధి కమిటీ అధ్యక్ష, కార్యదర్శి, కార్యవస్గభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్బంగా అధ్యక్ష, కార్యదర్శి, కార్యవర్గ సభ్యులు మాట్లాడుతూ హిందూ స్మశాన అభివృద్ధికి సహకరిస్తున్న ప్రజాప్రతినిధులు, దాతలు, స్వచ్ఛంద సంస్థలు, తదితరులు సహాయ సహకారాలు అందించాలని కోరారు. ఎవ్వరైన సహృదయులు హిందూ స్మశాన వాటికను దత్తత తీసుకుని సుందరికరణ చేయాలని కోరుతూ హిందూ స్మశాన వాటిక అభివృద్ధికి షహకరిస్తున్న ప్రజాప్రతినిధులు, దాతలకుధన్యవాదములు తెలియజేసారు.

## పౌర హక్కుల దినోత్సవం విజయవంతం

కలికిరి, ఫిబ్రవరి 27, ప్రభాతవార్త:




మండలంలోని గుట్టపాలెం పంచాయతీ డీ.కె. వారిపల్లిలో గ్రామంలో శుక్రవారం తహసీల్దార్ ఎస్. సయిద్ పర్యవేక్షణలో నిర్వహించిన పౌరహక్కుల దినోత్సవం విజయవంతం అయ్యింది. ఈ కార్యక్రమం డిప్యూటీ తహసీల్దార్ వెంకటరమణారెడ్డి ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా డిప్యూటీ తహసీల్దార్ వెంకటరమణారెడ్డి మాట్లాడుతూ ప్రతి నెల చివరి వారంలో ఎస్సీ, ఎస్టీ గ్రామాలను మండల స్థాయి అధికారులు సందర్శించి పౌరహక్కుల దినోత్సవం నిర్వహించి సమస్యలపై ఎస్సీ, ఎస్టీల నుంచి అర్జీలు స్వీకరించి వాటిని పరిష్కరించేందుకే ప్రభుత్వం పౌరహక్కుల దినోత్సవం నిర్వహిస్తున్నట్లు డిప్యూటీ తహసీల్దార్ తెలిపారు. గ్రామంలో సిమెంటు రోడ్లు, విద్యుత్తు స్తంభాలు ఏర్పాటు చేయాలని ఎస్సీలు అధికారుల దృష్టికి తీసుకురావడం జరిగింది. ఏఎస్సై నరసింహులు సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. గ్రామాల్లో ఎక్కడైనా కులవివక్ష చూపితే పోలీసుల దృష్టికి తీసుకురావాలని ఏఎస్సై పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారిణి హేమలత, హెడ్‌కానిస్టేబుల్ రాజేంద్రప్రసాద్, గ్రామ పెద్దలు కంభం వెంకట రమణారెడ్డి, వీఆర్‌వో దశరథ, ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ కమిటీ సభ్యులు అగస్తీశ్వర్, ఏసురాజు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## నేడే ఎన్టీఆర్ భరోసా పింఛన్లు పంపిణీ

కలికిరి, ఫిబ్రవరి 27, ప్రభాతవార్త:

మండలంలోని 14 గ్రామ పంచాయతీల్లో ఈ నెల 28వ తేదీ శనివారం ఉదయం 6 గంటలకే ఎన్టీఆర్ భరోసా పింఛన్లు పంపిణీ జరుగుతుందని ఎంపీడీవో భానుమూర్తిరావు తెలిపారు. ఇప్పటికే పింఛన్లు పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పంపిణీ చేసేలా చర్యలు తీసుకున్నట్లు ఎంపీడీవో తెలిపారు.

## సైబర్ నేరాలపై కళా జాగృతి అవగాహన

బద్వేలు, ఫిబ్రవరి 27, ప్రభాతవార్త



కడప జిల్లా పోలీస్ సూపరింటెండెంట్ షెల్కే నచికేత్ విశ్వనాథ్ ఆదేశాల మేరకు కళా జాగృతి బృందం ఆధ్వర్యంలో బద్వేల్ రూరల్ పరిధిలోని పీపీ కుంట గ్రామంలో కళాజాత నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మైదుకూరు డీఎస్పీ రాజేంద్ర ప్రసాద్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కార్యక్రమంలో బద్వేల్ రూరల్ సీఐ క్రిష్ణయ్య, ఎస్ఐ రంగారావు మరియు ఇతర పోలీసు సిబ్బంది పాల్గొని మాట్లాడుతూ సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు ఎర్రచందనం అక్రమ రవాణాను అరికట్టడంలో ప్రజల పాత్ర ఎంత ముఖ్యమో వివరించారు. అపరిచిత ఫోన్ కాల్స్, ఆన్‌లైన్ మోసాలు, బ్యాంక్ వివరాలు పంచుకోవడంపై జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అలాగే అనుమానాస్పద కార్యకలాపాలపై వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. అటువంటి వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు. గ్రామస్తులు ఈ కార్యక్రమాన్ని అభినందిస్తూ పోలీసు శాఖ చేపడుతున్న అవగాహన చర్యలకు సహకరిస్తామని తెలిపారు.

## నేడు స్వచ్ఛరథం ప్రారంభం

కలసపాడు, ఫిబ్రవరి 27 ప్రభాతవార్త:

కలసపాడు మండలంలో శనివారం రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన స్వచ్ఛ రథం వాహనాన్ని ప్రారంభిస్తున్నట్లు ఎంపీడీవో మహబూబ్ బీ తెలిపారు. ఈ వాహనం యొక్క ముఖ్య ఉద్దేశం తమ ఇళ్లలో ఉన్న పాత వస్తువులను సేకరించి అందుకు సమానమైన విలువగల నిత్యవసర వస్తువులను అందజేయడమే ప్రధాన లక్ష్యమన్నారు. కావున ప్రజలంతా ఈ స్వచ్ఛ రథం కార్యక్రమానికి సంపూర్ణ సహకారం అందజేసి చెత్త నుండి సంపద పొంది మన గ్రామ పరిశుభ్రతను కాపాడుకుందామని ఆమె పిలుపునిచ్చారు. ప్రారంభోత్సవ కార్యక్రమానికి మండల అధ్యక్షులు, సర్పంచ్, ఎంపీటీసీ తదితర ప్రజాప్రతినిధులు హాజరుకావాలని తెలిపారు.

## సేవా టిక్కెట్ల విక్రయాలు

చౌడేపల్లి, ఫిబ్రవరి 27 ప్రభాతవార్త

స్థానిక శ్రీ మృత్యుంజయేశ్వరస్వామి ఆలయంలో దేవాదాయధర్మాశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పలు సేవా టిక్కెట్లను భక్తులు సద్వినియోగం చేసుకోవాలని పుంగనూరు గ్రూప్ టెంపుల్స్ ఇఓ రమణ కోరారు. ఆమేరకు ఆలయం వద్ద బోర్డును ఆయన ఏర్పాటు చేసారు. ఆలయంలో స్వామివారికి నిర్వహించే వివిధ రకాలు కైంకర్యాలు, సేవలను వాటి ధరలను గురించి బోర్డులో వేశారనీ, భక్తులు అందుకు అనుగుణంగా అదికారులచే రసీదు పొందాలని కోరారు.

## స్పెషల్ పార్టీలతో కొనసాగుతున్న దాడులు

కడప క్రైం, ఫిబ్రవరి 27, ప్రభాతవార్త:

గంజాయి, అసాంఘిక కార్యకలాపాలు, బహిరంగ ప్రదేశాల్లో మద్యపానం సేవించే వారిపై కఠిన చర్యలకు పోలీసు అధికారులు స్పెషల్ పార్టీ సిబ్బంది ద్వారా స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తూ మరియు డ్రోన్ కెమెరాల ద్వారా సాంకేతిక పరిజ్ఞానం వినియోగిస్తున్నారు. జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ ఆదేశాల మేరకు కడప డీఎస్పీ వెంకటేశ్వర్లు పర్యవేక్షణలో కడప టు టౌన్ సీఐ జి.ప్రసాదరావు ఆధ్వర్యంలో కడప నగరం తాలూకా పీఎస్ పరిధిలో గంజాయి సేవనం, బహిరంగ మద్యపానం, అసాంఘిక కార్యకలాపాలు జరిగే అవకాశం ఉన్న ప్రాంతాల్లో కడప సబ్ డివిజన్ స్పెషల్ పార్టీ సిబ్బంది దాడులు నిర్వహించారు. అత్యాధునిక డ్రోన్ కెమెరాల సాయంతో జల్లెడ పడుతున్నారు. శుక్రవారం అనుమానాస్పదంగా సంచరించే వారిపై నిఘా ఉంచడంతో పాటు గంజాయిని సేవించే వారిని బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించే వారిని గుర్తించేందుకు విస్తృత చర్యలు చేపట్టారు. నగరంలోని అల్మాస్‌పేట, వక్కలపేట, సంగంపేట, సాయిపేట, మాసాపేట, బిస్మిల్లానగర్, యానాదికాలనీ, మోచంపేట తదితర ప్రాంతాల్లో డ్రోన్ కెమెరాలతో నిఘా ఉంచడం ద్వారా అనుమానితులను గుర్తించే చర్యలు చేపట్టారు. జిల్లా ఎస్పీ ఆదేశాలతో నిరంతరం కడప నగరంలోని అనుమానిత ప్రాంతాలను పోలీసు శాఖ ఆధ్వర్యంలో జల్లెడ పట్టడం జరుగుతుందని కడప డీఎస్పీ వెంకటేశ్వర్లు తెలిపారు.


**ఒరిజినల్ డాక్యుమెంట్ పోయినది**

గోసంగి జనార్ధనరెడ్డి తండ్రి సుబ్బారెడ్డి D.No.6/26 సున్నపురాళ్లపల్లె గ్రామం, ఎర్రగుంట్ల (మం) వైఎస్ఆర్ కడప (జిల్లా) ఏపీ., మా ఇంటి నుండి ఎర్రగుంట్లకు వెళుతుండగా నాయొక్క ఒరిజినల్ డాక్యుమెంట్ పోయినది. సర్వే నంబర్: 565 డాక్యుమెంట్ నెం: 435/200/12/2. సంవత్సరం 12-03-2012. దొరికినారు పై అడ్రస్‌కి తెలియజేయగలరు.

**ఒరిజినల్ డాక్యుమెంట్ పోయినది**

గోసంగి జనార్ధనరెడ్డి తండ్రి సుబ్బారెడ్డి D.No.6/26 సున్నపురాళ్లపల్లె గ్రామం, ఎర్రగుంట్ల (మం) వైఎస్ఆర్ కడప (జిల్లా) ఏపీ., మా ఇంటి నుండి ఎర్రగుంట్లకు వెళుతుండగా నాయొక్క ఒరిజినల్ డాక్యుమెంట్ పోయినది. సర్వే నంబర్: 565 డాక్యుమెంట్ నెం: 935/40/7. సంవత్సరం 28-07-2017 దొరికినారు పై అడ్రస్‌కి తెలియజేయగలరు.

**CHANGE OF SURNAME**

I, CHANDRAVATHI MANDI, W/o MANDI NAGIREDDY, R/at D.No. 5-174-B, Sunkesula V&P, Khajipeta (M), YSR Kadapa Dist, AP - 516203, have changed my surname from CHANDRAVATHI MANDI to CHANDRAVATHI BHEEMCHERLA. Henceforth, I shall be known as CHANDRAVATHI BHEEMCHERLA for all purposes.

## పరిసరాల శుభ్రతతోనే ఆరోగ్యానికి రక్ష

బద్వేలు అర్బన్, ఫిబ్రవరి 27, ప్రభాతవార్త



మండలంలోని నంది పల్లి గ్రామంలో శుక్రవారం 'ఫ్రైడే డ్రైడే' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవడం ద్వారా అనేక వ్యాధులను నివారించవచ్చని మలేరియా సబ్‌యూనిట్ అధికారి నరసింహారెడ్డి తెలిపారు. కార్యక్రమంలో భాగంగా వైద్య సిబ్బంది ప్రతి ఇంటిని సందర్శించి లార్వా సర్వే, ఫీవర్ సర్వేలు నిర్వహించారు. దోమల పెరుగుదలకు కారణమయ్యే లార్వా ఎలా ఉంటుందో, దాన్ని ఎలా నిర్మూలించాలో ప్రజలకు వివరించారు. అవసరమైన ప్రాంతాల్లో మెడికల్ క్యాంపులు నిర్వహిస్తూ ప్రజల ఆరోగ్య పరిరక్షణకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ప్రత్యేకంగా కొళాయి పైపుల లీకేజీలపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ జనార్దన్ రావు, సిహెచ్ఓ జ్యోష్ణ, ఏఎన్ఎం రాములమ్మ తదితర వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## బద్వేల్‌కు నిధులు కేటాయించకపోవడం దుర్మార్గం

బద్వేలు, ఫిబ్రవరి 27, ప్రభాతవార్త




శాసనసభ బడ్జెట్ సమావేశాల్లో బద్వేల్ నియోజకవర్గానికి ఒక్క రూపాయి కూడా కేటాయించకపోవడం దుర్మార్గమని సిపిఐ ఎంఎల్ జిల్లా స్టాండింగ్ కమిటీ సభ్యుడు ఎస్. చంద్రశేఖర్ విమర్శించారు. శుక్రవారం పార్టీ కార్యాలయంలో జిల్లా కమిటీ సభ్యుడు జకరయ్య అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్ మాట్లాడుతూ 2014-19లో సోమశిల వెనుక జలాలను బద్వేల్ ప్రాంతానికి మళ్లించేందుకు జీఓ జారీచేసి నిధులు విడుదల చేయలేదని అప్పట్లో విమర్శించిన నేతలు, ప్రస్తుతం అధికారంలో ఉన్నప్పటికీ 20 నెలలు గడిచినా నిధులు కేటాయించకపోవడం బాధాకరమన్నారు. సోమశిల వెనుక జలాల జీఓ అమలుకు రూ.100 కోట్లు కేటాయిస్తే గోపవరం, అట్లూరు, బద్వేల్ ప్రాంతాలు సస్యశ్యామలం అవుతాయని తెలిపారు. బద్వేల్ పెద్ద చెరువు, కలసపాడు రాచెరువులకు టీఎంసీ నీరు మళ్లించి మినీ రిజర్వాయర్లుగా అభివృద్ధి చేయాలని, రైతాంగాన్ని ఆదుకోవాలని డిమాండ్ చేశారు. భాకరాపేట-గిద్దలూరు రైలుమార్గాన్ని బద్వేల్ మీదుగా ఏర్పాటు చేయాలని, అలాగే బద్వేల్ పట్టణంలో తక్షణమే ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలని కోరారు. సమావేశంలో పార్టీ జిల్లా, ఏరియా నాయకులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు ప్యాడ్లు, పెన్నులు వితరణ

తొండూరు ఫిబ్రవరి 27 ప్రభాతవార్త:



మండలంలోని మల్లెల గ్రామంలో జిల్లా పరిషత్ హైస్కూల్‌లో పదవ తరగతి చదువుతున్న16 మంది విద్యార్థులకు "పెన్నులను మరియు ఎగ్జామ్ ప్యాడ్లను" పంపిణీ చేసిన ఎమ్మెల్సీ శ్రీ భూమిరెడ్డి రామగోపాల్ రెడ్డి బావమరిది శంకర్ రెడ్డి జిల్లా పార్లమెంటు ఉపాధ్యక్షులు బొజ్జ మైసూరా రెడ్డి స్కూల్ కమిటీ చైర్మన్ శ్రీనివాస్ పాల్గొని పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో స్కూల్ హెడ్మాస్టర్ కోనేటి సుధాకర్ తాళ్లపల్లి వెంకటేశ్వర్ రెడ్డి సుధీర్‌రెడ్డి రాఘవ పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్కూల్ చైర్మన్ మాట్లాడుతూ వచ్చే పదవ తరగతి పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు "ప్రథమ బహుమతిగా 10,000 రూపాయలను" ప్రకటించారు. విద్యార్థులకు ఆల్‌దిబెస్ట్ చెప్పి భవిష్యత్తులో ఉన్నత స్థాయికి చేరుకోవాలన్నారు.

## మార్కెట్టి యార్డ్‌ను మనుగడలోకి తెస్తాం

చిన్నమండెం పిబ్రవరి 27 ప్రభాతవార్త:



మండల కేంద్రం పోలీస్ స్టేషన్ ఎదురుగా రాయచోటి మదనపల్లి ప్రధాన రహదారి పక్కన ఉండే మార్కెట్ యార్డ్ ఓపెన్ చేయియాలని చిన్నమండెం రైతులు మరియు నాయకులు మంత్రి మండిపల్లి రామప్రసాద్‌రెడ్డిని మరియు లక్ష్మిప్రసాద్‌రెడ్డికి చెప్పడం జరిగింది. స్పందించిన మంత్రి మార్కెట్ యార్డ్ చైర్మన్ అనంపల్లి రాంప్రసాద్‌రెడ్డి, మార్కెట్‌యార్డ్ సెక్రటరీని పిలపించి సమస్యలు చూసి మనుగడలోకి వచ్చే విదంగా చూడాలన్నారు. ఈ సందర్భంగా శుక్రవారం మార్కెట్ యార్డ్‌చైర్మన్ అనంపల్లి రామప్రసాద్‌రెడ్డి, అధికారులు. చిన్నమండెం మార్కెట్ ను సందర్శించడం జరిగింది. పనులు స్టార్ట్ చేస్తాం అని చెప్పడం జరిగింది. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు అక్రమ ఖాన్ మండిపల్లి పెద్ది రెడ్డి సిద్దయ్య ఘోసేఖన్ ఖదీర్ రాంచంద్ర నాజిమ్ బాషా తమజీర్ జియాల్లాహ్ జాబిల్లా మరియు నాయకులు రైతులు పాల్గున్నారు.

## చట్టాలపై విద్యార్థులకు అవగాహన

ఒంటిమిట్ట ఫిబ్రవరి. 27 ప్రభాతవార్త



మండల కేంద్రమైన ఒంటిమిట్ట సాయి భారతి పాఠశాల విద్యార్థులకు ఒంటిమిట్ట సబ్ ఇన్స్పెక్టర్ శ్రీనివాసులు శుక్రవారం చట్టాలపై, జీవిత విలువలపై అవగాహన కల్పించడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన పాఠశాల విద్యార్థులతో మాట్లాడుతూ ఈనాటి బాలలే రేపటి పౌరులని ఇప్పుడున్న ప్రస్తుత పరిస్థితుల్లో న్యాయస్థానంలోని చట్టాలపై ప్రతి ఒక్కరూ పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. మంచి అలవాట్లతో కూడిన విద్యను అభ్యసించి భవిష్యత్తుకు పూల బాటలు వేసుకుని చిన్న వయసులోనే న్యాయస్థానంలోని చట్టాల, సెక్షన్ల, మానవ జీవన విధాన సమగ్రతను తెలుసుకొని సమాజంలో గౌరవంగా బతకాలన్నాడు. లైసెన్సు లేకుండా వాహనాలు నడపడం నేరమన్నాడు. నడుపుతూ పట్టుపడితే కేసు పెట్టడం జరుగుతుందన్నాడు. పుట్టిన గడ్డకు, దేశానికి మంచి పేరు తేవాలన్నాడు. ముఖ్యంగా 9,10 తరగతులు ప్రతి విద్యార్థికి తొలిమెట్టని జీవితాన్ని శాసిస్తుందన్నాడు. పబ్లిక్ పరీక్షలు రాసే విద్యార్థులు ? ఒత్తిడిలకు లోను కావద్దని గుర్తుపెట్టుకున్న విషయాలు కూడా మర్చిపోవడం జరుగుతుందని జాగ్రత్తగా ఉండాలన్నాడు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ రామ తులసి, ప్రధానోపాధ్యాయుడు, సుబ్బరామయ్య, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## బకాయిలు విడుదల చేయాలి: ఏపీటీఎఫ్

పోరుమామిళ్ల రూరల్, ప్రిబ్రవరి 27 ప్రభాతవార్త:



ఉద్యోగ ఉపాధ్యాయులకు కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చాలని ఏపీటీఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం పోరుమామిళ్ల, నరసాపురం ప్రాంతాల్లో ఉపాధ్యాయులు సమస్యలు పరిష్కరించాలంటూ నిరసన వ్యక్తం చేశారు. ఉద్యోగులకు సిపిఎస్ రద్దు చేసి అందరికీ పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. రావలసిన బకాయిలు, PRC, IR ఇవ్వకపోతే భవిష్యత్తులో ఢిల్లీలో ధర్నా చేయవలసిన పరిస్థితి వస్తుందని హెచ్చరించారు.

## టూటౌన్ ఎస్సైగా నాగేశ్వరరావు

మదనపల్లె క్రైమ్, ఫిబ్రవరి 27 ప్రభాతవార్త.



టూటౌన్ పోలీస్ స్టేషన్ సబ్ ఇన్‌స్పెక్టర్‌గా నాగేశ్వరరావు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ విధులు నిర్వహించిన ఎస్సై రహీముల్లా మదనపల్లి ఒటు పట్టణ పోలీస్ స్టేషన్‌కు బదిలీ కావడంతో, చౌడేపల్లి ఎస్సైగా ఉన్న నాగేశ్వరరావును నియమిస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ జిల్లా ఎస్పీ, మదనపల్లి డి.ఎస్.పి, టూ టౌన్ సీఐల అదేశాల మేరకు పట్టణంలో శాంతిభద్రతలను పరిరక్షిస్తామన్నారు. బాధితులు పోలీస్‌స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదులను అందజేయవచ్చన్నారు.

## ఉచిత సీట్లకు దరఖాస్తుల ఆహ్వానం

మదనపల్లె క్రైమ్, ఫిబ్రవరి 27 ప్రభాతవార్త.



విద్యాహక్కు చట్టం ప్రకారం 2026, 27 విద్యా సంవత్సరానికి గాను జిల్లాలోని ప్రైవేట్ అన్ఎయిడెడ్ పాఠశాలల్లో 1వ తరగతిలో 25 శాతం ఉచిత ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సమగ్ర శిక్షా జిల్లా అదనపు ప్రాజెక్టు కోఆర్డినేటర్ డాక్టర్ నున్నా అనూరాధ తెలిపారు. శుక్రవారం జిల్లా సమగ్ర శిక్షా కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమాచార బోర్డును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏపీసీ మాట్లాడుతూ ఈ పథకం ఐబీ, సీబీఎస్ఈ, ఐసీఎస్ఈ, స్టేట్ సిలబస్ అనుసరించే అన్ని ప్రైవేట్ పాఠశాలలకు వర్తిస్తుందన్నారు. అనాథలు, హెచ్ఐవి బాధితుల పిల్లలు, దివ్యాంగులు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఆర్థికంగా వెనుకబడిన మైనార్టీలు, ఓసీ వర్గాలకు చెందిన పేద విద్యార్థులు దీనికి అర్హులన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు మార్చి 10వ తేదీలోపు ఆన్‌లైన్‌లో నమోదు దరఖాస్తు చేసుకోవాలన్నారు. సందేహాల కోసం టోల్‌ఫ్రీ నంబర్ 18004258599 ను సంప్రదించలన్నారు. ఈ కార్యక్రమంలో సమగ్ర శిక్షా సెక్టోరియల్ అధికారులు కరుణాకర్, సుమతి, అసదుల్లా, యశోద, కార్యాలయ సూపరింటెండెంట్ శ్రీనివాసులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ప్లాస్టిక్ వద్దు - పర్యావరణం ముద్దు

పులివెందుల, ఫిబ్రవరి 27, ప్రభాతవార్త :


స్వచ్ఛత సామాగ్రిని అందిస్తున్న యుసిఐఎల్ అధికారులు

యురేనియం కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ తుమ్మలపల్లి ఆధ్వర్యంలో ఫిబ్రవరి 16 నుండి 28 వరకు నిర్వహిస్తున్న స్వచ్ఛతా పక్షోత్సవాల సందర్భంగా శుక్రవారం పర్యావరణ పరిరక్షణపై అవగాహన కార్యక్రమాలు విస్తృతంగా నిర్వహించారు. ఇందులో భాగంగా "ప్లాస్టిక్ వద్దు - పర్యావరణం ముద్దు" అనే నినాదంతో తుమ్మలపల్లి పరిసర ప్రాంతాల్లోని పాఠశాలల్లో ప్రత్యేక కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులకు ప్లాస్టిక్ వినియోగం వల్ల కలిగే పర్యావరణ, ఆరోగ్య నష్టాలను యూసీఐఎల్ అధికారులు వివరించారు. ప్లాస్టిక్ వ్యర్థాలు భూమి, నీరు, గాలి కాలుష్యానికి ఎలా కారణమవుతున్నాయో తెలియజేశారు. కార్యక్రమం ముగింపులో ప్రతి విద్యార్థికి స్టీల్ వాటర్ బాటిళ్లను పంపిణీ చేసి, ప్లాస్టిక్ బాటిళ్ల వినియోగాన్ని తగ్గించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో చీఫ్ సూపరింటెండెంట్ (మెకానికల్) రాజు, సూపరింటెండెంట్ (ఎలక్ట్రికల్) మునీర్ అహ్మద్, సూపరింటెండెంట్ (మెకానికల్) ఎన్.వి. రాజేష్, అడిషనల్ సూపరింటెండెంట్ (ఎలక్ట్రికల్) గణేష్ శంకర్, డిప్యూటీ మేనేజర్ (పర్సనల్) బి. తారకేశ్వర రావు, జిఎఫ్ఎమ్ (మైన్స్) వాసుదేవారెడ్డి, హెల్పర్‌బి జి. కిషోర్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, అంగన్వాడీ టీచర్లు మరియు యూసీఐఎల్ అధికారులు చురుకుగా పాల్గొని స్వచ్ఛతా పక్షోత్సవాలకు మద్దతు తెలిపారు.

## విద్యార్థులు నైపుణ్యాలను పెంచుకోవాలి

ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రాజగోపాల్

మదనపల్లె క్రైమ్, ఫిబ్రవరి 27 ప్రభాతవార్త.



మారుతున్న ప్రపంచ పరిస్థితులకు అనుగుణంగా విద్యార్థులు తమ నైపుణ్యాలను మెరుగుపరుచుకోవాలని హంద్రీనీవా ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రాజగోపాల్, విజయభారతి ఇంగ్లీష్ స్కూల్ చైర్మన్ సేతులు పిలుపునిచ్చారు. శుక్రవారం పాఠశాలలో ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ సమ్మిట్ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సాంకేతికతను అందిపుచ్చుకుంటూనే మానవీయ విలువలను కాపాడుకోవాలన్నారు. రాబోయే కాలం కృత్రిమ మేధ యుగమని, విద్యార్థులు ఈ సాంకేతికతపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. యంత్రాల వెనుక పనిచేసే మానవుడు విలువలతో కూడిన వాడై ఉండాలని, అప్పుడే సమాజానికి మేలు జరుగుతుందని అభిప్రాయపడ్డారు. విద్యా రంగాన్ని అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం ఎంతో కృషి చేస్తోందని, విద్యార్థులు ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకుని ఉజ్వల భవిష్యత్తును నిర్మించుకోవాలని కోరారు. కార్యక్రమంలో డాక్టర్ ఖాన్, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఓబిసి నూతన కమిటీ ఏర్పాటు

కడప కార్పొరేషన్ ఫిబ్రవరి 27 ప్రభాతవార్త:



మోదీ ప్రభుత్వం దేశాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తుందని భాజపా సికె.దిన్నె మండల అధ్యక్షులు గజ్జల వెంకటసుబ్బారెడ్డి అన్నారు. ఏపీ బిజెపి రాష్ట్ర అధ్యక్షులు పివిఎన్. మాధవ్ ఆదేశాల మేరకు, కడప జిల్లా అధ్యక్షులు జంగిటి వెంకటసుబ్బారెడ్డి సూచనలతో ఓబిసి కమిటీలను ఏర్పాటు చేశామన్నారు. శుక్రవారం భాజపా సికె.దిన్నె మండల అధ్యక్షులు గజ్జల వెంకటసుబ్బారెడ్డి అధ్యక్షతన సికె.దిన్నెలో ఓబీసీ కమిటీ ఏర్పాటు చేయడం జరిగింది. సికె.దిన్నె ఓబీసీ మోర్చా మండల అధ్యక్షునిగా పెద్దిబోయిన సుధాకర్‌యాదవ్, జనరల్ సెక్రటరీలుగా వెంకటసుబ్బయ్య, నాగమల్లయ్య యాదవ్‌లని నియమించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా భారతీయ జనతా పార్టీ ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షులు శ్రీ వెంకట రాముడు, కడప జిల్లా ఓబీసీ మోర్చా ఇన్చార్జ్ శ్రీరామదాసు, అనంతపురం జిల్లా ఇన్చార్జి కెవి.లక్ష్మీనారాయణరెడ్డి, మాజీ ఓబీసీ మోర్చా ఉపాధ్యక్షులు ప్రభు, ఓబీసీ మోర్చా ఉపాధ్యక్షులు మంజుల రామకృష్ణ, రాష్ట్ర మాజీ ఓబీసీ మోర్చా ఉపాధ్యక్షురాల పద్మావతి భాయ్, కడప జిల్లా ఓబీసీ మోర్చా మాజీ ఉపాధ్యక్షులు గాలి గణేష్, కిసాన్ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి నీలం నారాయణరెడ్డి, కువైట్ రమణారెడ్డి, సీనియర్ నాయకులు ప్రసాద్, మల్లికార్జ నరెడ్డ, ప్రధాన కార్యదర్శి సందడి అమర్నాథ్ రెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ప్రకృతి పెరటి తోట పంట పండింది

తంబళ్లపల్లె ఫిబ్రవరి 27 ప్రభాతవార్త ః



మోడల్‌స్కూల్‌లో రెండు మాసాల క్రితం స్పెషల్ ఆఫీసర్ అమరనాథ రెడ్డి ప్రయోగాత్మకంగా ప్రకృతి పెరటి తోట పెంపకం ప్రారంభించారు. ఆయన స్ఫూర్తితో ప్రిన్సిపల్ హేమంత్ కుమార్ ఎంఈఓ త్యాగరాజు సూచనలతో ప్రకృతి ఎరువులతో పెరటి తోట పెంపకం చేపట్టి సత్ఫలితం సాధించారు. శుక్రవారం స్పెషల్ ఆఫీసర్ అమరనాథరెడ్డి, కోసువారిపల్లి పీహెచ్సీ మెడికల్ ఆఫీసర్ సాదియాలు పెరటి తోటలోని పండిన పంటను చూసి పరవశించిపోయారు. తోటలో పండిన ముల్లంగి, ఆకుకూరలను పరిశీలించి మోడల్ స్కూల్ సిబ్బందిని ప్రశంసించారు .రసాయన ఎరువులతో పండిన పంటలతో ఆరోగ్యాలు క్షీణిస్తాయని మోడల్ స్కూల్‌లో ప్రకృతి జీవన ఎరువులు తో పండించిన వ్యవసాయ పంట అందరికీ ఆదర్శంగా నిలిచినట్లు కొనియాడారు. ఈ సందర్భంగా వారు మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ తో పాటు అధ్యాపకులు, విద్యార్థులు, సిబ్బందిని ప్రశంసించారు. వారి వెంట వైద్య సిబ్బంది, మోడల్ స్కూల్ సిబ్బంది పాల్గొన్నారు.

## బస్సు ఢీకొని రైతుకు తీవ్ర గాయాలు

మదనపల్లె క్రైమ్, ఫిబ్రవరి 27 ప్రభాతవార్త.

బస్సు ఢీకొని ఓ రైతు తీవ్రంగా గాయపడిన సంఘటన శుక్రవారం మదనపల్లె పట్టణంలో చోటు చేసుకుంది. బాధితుని కథనం మేరకు.. పట్టణంలోని వాల్మీకివీధికి చెందిన రైతు లక్ష్మీనారాయణ ద్విచక్రవాహనంలో స్థానిక ఎన్టీఆర్ సర్కిల్ కు బయల్దేరాడు. మార్గమధ్యంలో పటేల్ రోడ్డులో ప్రైవేటు ట్రావెల్స్ బస్సు రైతును ఢీకొంది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన రైతును గమనించిన స్థానికులు వెంటనే జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు ఆస్పత్రిలో చేర్చి చికిత్స అందిస్తున్నారు. ఒకటో పట్టణ పోలీసులు బస్సును స్టేషన్‌కు తరలించి, విచారణ చేస్తున్నారు.

## మానసాదేవికి తొడుగులు

సిద్ధవటం, ఫిబ్రవరి 27 ప్రభాతవార్త:



కడప చెన్నై జాతీయ రహదారి కనుమలోపల్లి సమీపాన వెలసిన శ్రీ మానసాదేవి అమ్మవారికి కడప నగరవాసులు తొడుగులు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ధర్మకర్త లక్ష్మయ్య మాట్లాడుతూ కడప పట్టణానికి చెందిన నారాయణ రవికుమార్ కుటుంబ సభ్యులు అమ్మవారి ప్రతిష్ట రోజున ప్రత్యేక పూజలో పాల్గొని తమ మొక్కుబడులో భాగంగా శుక్రవారం తొడుగులు సమర్పించి తమ భక్తిని చాటుకున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ పూజారి వీరయ్య అమ్మవారి భక్తులు పాల్గొన్నారు.

## ఉచిత ప్రవేశాల దరఖాస్తుకు ఆహ్వానం

ముద్దనూరు,ఫిబ్రవరి 27, ప్రభాతవార్త:



మండల పరిధిలోని ప్రైవేట్ పాఠశాలల్లో ఒకటవ తరగతిలో 25 శాతం సీట్లను ఆర్థికంగా బలహీన వర్గాల పిల్లలకు రాష్ట్ర ప్రభుత్వం అవకాశం కల్పించిన పోస్టర్లను శుక్రవారం మండల విద్యాశాఖ అధికారి నాగేశ్వరరావు నాయక్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 2026, 27 విద్యా సంవత్సరానికి సంబందించి విద్యా హక్కు చట్టం 2009,సెక్షన్ 12(1)సి ప్రకారం ఒకటవ తరగతి లో ఉచిత ప్రవేశాల కోసం ఆన్లైన్ ప్రక్రియను ప్రారభించామని ఈ సదవకాశాన్ని మండల ఆర్థికంగా వెనుకబడిన పేద మధ్యతరగతి విద్యార్థినీ విద్యార్థులు సద్వినియోపరుచుకోవాలని కోరారు. విద్యార్థుల ఫీజులను ప్రభుత్వం నేరుగా సంభంధిత ప్రైవేట్ పాఠశాలలకు చెల్లిస్తుంది, దీని ద్వారా పేద మరియు అట్టడుగు వర్గాల పిల్లలు కూడా నాణ్యమైన విద్యను పొందే అవకాశం కలుగుతుంది అని తెలిపారు. అడ్మిషన్ల కోసం తల్లిదండ్రులు సమీప గ్రామ /వార్డు సచివాలయ సిబ్బందిని సంప్రదించి ఆన్లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ కార్యాలయ సిబ్బంది సీఆర్పీలు సుదర్శన్ పాల్గొన్నారు.

## విజ్ఞాన విహారయాత్ర విద్యార్థులు

సిద్ధవటం ఫిబ్రవరి 27 ప్రభాతవార్త:



11వ బెటాలియన్ హైస్కూల్ విద్యార్థులు విజ్ఞాన విహారయాత్రకు ఈరోజు ఉదయం పాఠశాలలోని ఒకేషనల్ టీచర్స్ ఆధ్వర్యంలో ఇతరఉపాధ్యాయుల సహకారంతో పిల్లలందరిని ఆక్షన్వెంట్ వెటర్నరీ మెరిసిన్ ప్రొడక్షన్ యూనిట్, ఊటుకూరుని సందర్శించడం జరిగింది. అక్కడ జంతువుల కోసం తయారు చేసే మందుల గురించి మరియు స్టెరిలైజేషన్ ప్రాసెస్ గురించి క్షుణ్ణంగా తెలుసుకోవడం జరిగింది తర్వాత కృషి విజ్ఞాన కేంద్రం ఊటుకూరు నందు ప్రయోగశాలని సందర్శించడం జరిగింది. అక్కడ భూసార పరీక్షలు మరియు మట్టిలోని రంగుల నమూనాలను తెలుసుకోవడం జరిగింది. ఈ కార్యక్రమం వల్ల విద్యార్థులకు విజ్ఞానంతో పాటు వినోదాన్ని కూడా అందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో కడప జిల్లా జిసిడిఓ దార్ల రూత్ ఆరోగ్య మేరీ మరియు కడప జిల్లా కోఆర్డినేటర్ ఆర్ సునీల్ కుమార్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు పోతులూరయ్య ఉపాధ్యాయులు జి సమీర్‌బాష, కే నరసింహులు, జి సుమతి ఆర్ట్ టీచర్ ఎం చంద్రశేఖర్, ఒకేషనల్ టీచర్స్ జేవి హేమంత్ మరియు ఎస్ మోలాలి పాల్గొన్నారు.

## పోలీస్ స్టేషన్ ఆకస్మిక తనికి

ముద్దనూరు,ఫిబ్రవరి 27,ప్రభాతవార్త:



స్థానిక పోలీస్ స్టేషన్‌ను శుక్రవారం జమ్మలమడుగు డిఎస్పి వెంకటేశ్వరరావు ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. పలు రికార్డులను పరిశీలించి పెండింగ్ కేసులపై సిఐ నగేష్ బాబు తో సమీక్ష సమావేశం నిర్వహించి పెండింగ్ కేసులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని పేర్కొన్నారు. మండలంలోని ఫ్రాక్షన్ గ్రామాలపై ప్రత్యేక నిఘ ఏర్పాటు చేయాలని సూచించారు. స్టేషన్ పరిసరాలను పరిశీలించి ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సిబ్బందికి వివరించారు. కార్యక్రమంలో పోలీసులు పాల్గొన్నారు.

## ఉద్యమి సభ్యత్వ కార్యక్రమాన్ని విజయవంతం

పీలేరు ఫిబ్రవరి 27 ప్రభాతవార్త:


సమావేశంలో మాట్లాడుతున్న దృశ్యం

"ఉద్యమి" పేరుతో జనసేన పార్టీ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సభ్యత్వ కార్యక్రమం ఉద్యమంలా చేపట్టాలని ఆంధ్రప్రదేశ్ పోలీస్‌హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్, మరియు ఉద్యమి కార్యక్రమ సమన్వయకర్త కళ్యాణం శ్రీనివాసులు కార్యకర్తలకు పిలుపునిచ్చారు. పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డ్ ఆవరణలో కార్యకర్తలు, అభిమానులు ఆయనకు శాలువాలతో స్వాగతం పలికారు. ఈ కార్యక్రమం జనసేన పార్టీ పీలేరు నియోజకవర్గ ఇంచార్జ్ బెజవాడ దినేష్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనసేన పార్టీ కోసం అహర్నిశలు కష్టపడి పని చేసిన కార్యకర్తలు, అభిమానుల సంక్షేమం కోసం క్షేత్రస్థాయిలో రాష్ట్రవ్యాప్తంగా జనసేన "ఉద్యమి" సభ్యత్వం నమోదు కార్యక్రమం చేపట్టినట్లు కార్యకర్తలకు వివరించారు. రాబోయే రోజుల్లో పార్టీలో గుర్తింపు పొందిన వారికి రాజకీయ శిక్షణ తరగతులు ఏర్పాటు చేసి వారి భవిష్యత్తుకు బాటలు వేసి నాయకులు, సాధకులుగా తీర్చిదిద్దడమే జనసేన పార్టీ లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలో అతిధి అధికారి కృష్ణ, జనసేన పార్టీ ఉమ్మడి చిత్తూరు జిల్లా కార్యదర్శి, పీలేరు మార్కెట్ యార్డ్ డైరెక్టర్ కలప రవి, పీలేరు మండల అధ్యక్షులు మోహన్ కృష్ణ, కలికిరి మండల అధ్యక్షులు రవి, వాల్మీకిపురం మండల అధ్యక్షులు రెడ్డప్ప, పీలేరు మండల ఉపాధ్యక్షులు గురు మోహన్, మావిళ్ళ చరిత, నూర్జహాన్ వాల్మీకిపురం ఏఎంసీ డైరెక్టర్ ప్రభాకర్, నాయకులు కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

## ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమం

పీలేరు ఫిబ్రవరి 27 ప్రభాతవార్త:

పట్టణంలోని ఆర్‌టిసి నల్లగుట్టలో ఫ్యామిలీ ఫీజిషియన్ కార్యక్రమంలో భాగంగా నిక్షయ్ మిత్ర కార్యక్రమంలో భాగంగా టిబి చికిత్స పొందుతున్న వారికి, స్థానిక ప్రజారోగ్య విభగములో సిహెచ్ఓ గా విధులు నిర్వహిస్తున్న అయేషా పౌష్టికాహారం పంపిణీ చేయడమైనది. కార్యక్రమంలో డాక్టర్ చంద్రశేఖర్ మాట్లాడుతూ క్షయ వ్యాధి సోకిన వారు త్వరగా కొలుకోవాలంటే వివిధ పోషకాలతో కుడిన పౌష్టికాహారం అవసరమోతాయని, ఎవరైనా దయగల దాతలు టిబి వ్యాధి గ్రస్తులకు పౌష్టికాహారం పంపిని చేసి ఆదుకోవాలంటే మీ దగ్గర్లోని ఏయన్ యం ని సంప్రదించాలని ఆయన చెప్పారు. నిక్షయ్ పోషణ యోజన క్రింద ఇలాంటి వ్యాధిగ్రస్తులకు చికిత్స పొందే కాలానికి నెలకు వెయ్యి రూ: 1000 వారి అకౌంట్ జమ చేయడం జరుగుతుందని, క్షయ నిర్మూలనకు ప్రభుత్వం ప్రవేశపెట్టిన టిబి ముక్తభారత్ అభియాన్ ఫేస్ 2 లో భాగంగా అనుమానితులు వ్యాధి నిర్ధారణకు సహకరించి డాక్టర్స్ ఇచ్చే చికిత్స సూచన సలహాలు పొంది టిబి వ్యాధి రహిత సమాజానికి సహకరించాలని డాక్టర్ చంద్రశేఖర్ పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పిహెచ్ సి తలుపుల మరియు పీలేరు టిబి యూనిట్ అధికారులు,సిబ్బంది పాల్గొన్నారు.


టీబీ వ్యాధిపై అవగాహన దృశ్యం

## ఘనంగా విరూపాక్షమ్మ దేవి విగ్రహ ప్రతిష్ట

సదుం ఫిబ్రవరి 27 ప్రభాతవార్త



మండల పరిధిలోని నడిగడ్డ మతుకువారిపల్లె గ్రామం వద్ద శ్రీశ్రీశ్రీ విరూపాక్షమ్మ దేవి విగ్రహ ప్రాణ ప్రతిష్ట కార్యక్రమాలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం గంగపూజ ,అమ్మవారి పంచగవ్య, పంచామృత అభిషేకం నిర్వహించారు. రాత్రి అమ్మవారి విగ్రహాన్ని గ్రామపంచాయతీలోని అన్ని గ్రామాల్లో ట్రాక్టర్‌లో ఊరేగించారు. గురువారం ధ్వజస్తంభ ప్రతిష్టాపన, సకల దేవతా కలసారాధన, సకల దేవత హోమం, సాయంకాలం దుర్గా హోమం, దేవతా శయన దివాసం జరిపించారు. శుక్రవారం ఉదయం అమ్మవారి విగ్రహ ప్రతిష్ట అనంతరం కుంభాభిషేకం, ప్రాణ ప్రతిష్ట ఘనంగా నిర్వహించారు. అమ్మవారికి విశేషా అలంకారం చేసి అన్నదాన కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ఉభయ దారులుగా డిఎస్ఈశ్వర్ రెడ్డి, అశోక్ రెడ్డి, ఎం మల్లికార్జునెడ్డి ,డి లోకేష్ రెడ్డి, డి సురేందర్ రెడ్డి, డి మహేష్ రెడ్డిలు కాగా అర్చకులు మహేష్ శాస్త్రి ప్రశాంత్ శాస్త్రి యశ్వంత్ ల ఆధ్వర్యంలో నిర్వహించారు. వివిధ గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. భక్తులకు చేత ప్రసాదాలు వినియోగించారు.

## పాల నాణ్యతపై తక్షణమే విచారణ జరపాలి

డిఏహెచ్ఓకు బివైఎస్ నాయకులు వినతి

మదనపల్లె, ఫిబ్రవరి 27 ప్రభాతవార్త :


వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

పాల మాఫియా ఉదంతం నేపథ్యంలో మదనపల్లె పరిసర ప్రాంతాల్లో విక్రయిస్తున్న పాల నాణ్యతపై విచారణ జరపాలని బహుజన యువసేన అధ్యక్షులు పునిత్‌కుమార్ డిమాండ్ చేశారు. శుక్రవారం జిల్లా పశువర్ధకశాఖ అధికారి (డిఏహెచ్ఓ)గుణశేఖర్‌కు ఆయన వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్న పాల కల్తీరాయుళ్ళపై కఠినచర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. యూరియా, హానికరమైన రసాయనాలు,పామాయిల్ కల్తీ తయారు చేస్తున్న కృత్రిమపాలు మార్కెట్‌లోకి వస్తున్నాయని వీటివల్ల చిన్నపిల్లలు, వృద్దులు అనారోగ్యానికి గురవుతున్నారన్నారు. పట్టణంలోని ప్రధాన డెయిరీ ప్లాంట్లుతో పాటు చిల్లర విక్రయ కేంద్రాల్లో శ్యాంపుల్స్‌ను సేకరించి ల్యాబ్‌కు పంపాలని కోరారు. డిఏహెచ్ఓ స్పందిస్తూ పాల నాణ్యత విషయంలో రాజీ పడే ప్రసక్తేలేదని త్వరలోనే ఫుడ్‌సేఫ్టీ అదికారులతో కలసి సంయుక్త తనిఖీలు నిర్వహిస్తామన్నారు.

## 5న రాష్ట్ర వ్యాప్తంగా విధాత చిత్రం విడుదల

నిర్మాత డాక్టర్ అప్పినిపల్లి బాస్కరాచారి

మదనపల్లె, ఫిబ్రవరి 27 ప్రభాతవార్త :



ఆంధ్ర ప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో మార్చి 5న విధాత సినిమా విడుదల చేయనున్నట్లు సినిమా నిర్మాత, కథా నాయకుడు డాక్టర్ అప్పినిపల్లి భాస్కరాచారి, దర్శకుడు మణికంఠ రాజేంద్రలు తెలిపారు. శుక్రవారం వారు విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ మదనపల్లె కేంద్రంగా స్థానికంగా ప్రతిభ కలిగిన నటీ, నటులతో మొదటి ఏబిసి ప్రొడక్షన్‌పైన తెరకెక్కిన మొదటి సినిమాగా విధాత చిత్రం చరిత్ర సృష్టించబోతోందన్నారు. నిర్మాతే సాహసం చేసి తన సినిమాను ప్రేక్షక దేవుళ్ళు ఆదరిస్తారన్న విశ్వాసంతో సొంతంగా సినిమాని విడుదల చేయడానికి నిర్ణయించుకొన్నారు. సినిమా ప్రమోషన్ కోసం, చిత్ర పరిశ్రమలోని పెద్దలతో కలసి వారి మద్దతును కూడా కూడగట్టుకొన్నట్లు తెలిపారు. ఇప్పటికే సెన్సార్ ప్రక్రియను పూర్తి చేసుకొన్న సినిమా మంచి సందేశంతో పాటు అన్ని వర్గాల ప్రజలను ఆకట్టుకునే విధంగా ఉంటుందని తెలిపారు. మదనపల్లె పరిసర ప్రాంతాలతో పాటు బెంగుళూరు, హైదరాబాద్, వైజాగ్ ప్రాంతాల్లో చిత్ర నిర్మాణం పూర్తి అయ్యిందన్నారు. విధాత చిత్రానికి దర్శకులు, కెమరామెన్, ఎడిటర్ రాజేంద్రబాబు కాగా, హైదరాబాద్ పోస్టు ప్రొడక్షన్ కొరకు జరుగుతుందన్నారు. సమాజానికి స్ఫూర్తినిచ్చే విధంగా ఈ చిత్రం ఉంటుందన్నారు.

## నిరసన తెలిపే హక్కును కాలరాస్తున్న పోలీసులు

సిపిఎం జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు

మదనపల్లె, ఫిబ్రవరి 27 ప్రభాతవార్త :


మాట్లాడుతున్న సిపిఎం నాయకులు

నిరసన తెలియజేసే హక్కును పోలీసులు కాలరాస్తున్నారంటూ సిపిఎం జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు తీవ్రంగా ఖండించారు. శుక్రవారం ప్రజలు సమస్యలను అధికారులకు విన్నవించేందుకు కలెక్టరేట్‌కు వస్తే పోలీసులు అడ్డుకోవడం విడ్డూరంగా ఉందన్నారు. తమ న్యాయమైన సమస్యలను పరిష్కారం అయ్యేందుకు కలెక్టరేట్ వద్దకు వచ్చిన కార్మికులను పోలీసులు అడ్డుకొని ఇక్కడ ధర్నాలకు, నిరసనలకు అనుమతులు లేనవి హుకుం జారీ చేయడం ప్రజాస్వామ్యంలో విడ్డూరంగా ఉందన్నారు. బావ ప్రటకన, స్వేచ్ఛ, నిరసన తెలిపే హక్కు భారతరాజ్యాంగం కల్పించిందన్నారు. తమ సమస్యల పరిష్కరించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తుంటే కలెక్టరేట్ వద్ద నిరసనలు తెలిపేందుకు వస్తుంటే పోలీసులు అడ్డుకోవడం, కేసులు నమోదు చేస్తామని చెప్పడం దుర్మార్గం అన్నారు. ఈసమావేశంలో సిపిఎం నాయకులు రామాంజులు, హరిశర్మ, లోకేష్, ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

## టిడిపి కమిటి ప్రమాణ స్వీకారోత్సవానికి తరలిరండి

ప్రచార రథాన్ని ప్రారంభించిన పఠాన్‌ఖాదర్‌ఖాన్

మదనపల్లె, ఫిబ్రవరి 27 ప్రభాతవార్త :


ప్రచార రథాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

రాజంపేట పార్లమెంటరీ టిడిపి కమిటీ ప్రమాణ స్వీకారోత్సవానికి తరలివచ్చి విజయవంతం చేయాలంటూ ప్రధాన కార్యదర్శి పఠాన్‌ఖాదర్‌ఖాన్ కోరారు. శుక్రవారం ఆయన ప్రచార రథాన్ని ప్రారంభించారు. అనంతరం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ పార్లమెంట్ కమిటీలో అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి, ఉపాధ్యక్షులు, కార్యదర్శులు, అధికార ప్రతినిధులు, సోషల్‌మీడియా ప్రతినిధులు అందరూ కలసి 41మంది సభ్యులు బైపాస్‌రోడ్డులోని రామ్‌తులసి కళ్యాణ మండపంలో మార్చి 2న సోమవారం ప్రమాణ స్వీకారం చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ముఖ్య అతిధులుగా మంత్రి రామ్‌ప్రసాద్‌రెడ్డి, ఎమ్మెల్యేలు కిషోర్‌కుమార్‌రెడ్డి, షాజహాన్‌బాషా, టిడిపి నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లు హాజరవుతారన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి పట్టణ అధ్యక్షులు నాదేళ్ళ అరుణ్‌తేజ్, నాయకులు షోయాప్‌శీన, ఎస్ఎం.రఫి, సుధాకర్, రవి తదితరులు పాల్గొన్నారు.

## వాహనాలు తనిఖీలు

సిద్ధవటం ఫిబ్రవరి 27 ప్రభాతవార్త :



కొండ సంపద తరలిపోకుండా విస్తృతంగా వాహనాలు తనిఖీలు చేపట్టారు మండల కేంద్రమైన సిద్ధవటం గ్రామ శివారులోని ఫారెస్ట్ చెక్ పోస్ట్ వద్ద శుక్రవారం రాత్రి ఫారెస్ట్ రేంజ్ అధికారి కళావతి విస్తృతంగా వాహనాలు తనిఖీలు చేపట్టారు ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కడప డీఎఫ్ఓ ప్రణీత్ కుమార్ ఆదేశాలతో కొండ సంపద తరలిపోకుండా ఫారెస్ట్ రేంజ్ పరిధిలోని అట్లూరు, సిద్ధవటం, ఫారెస్ట్ చెక్ పోస్ట్ వద్ద తనిఖీలు చేపట్టామని ఎర్రచందనం అక్రమ రవాణా పాల్పడితే కఠినమైన చర్యలు తప్పవని హెచ్చరించారు ఈ కార్యక్రమంలో అటవీశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

# దేశ అభివృద్ధి ప్రణాళికలకు జనగణన గణాంకాలే పునాది

**శిక్షణా కార్యక్రమాలను విని అమలు చేయాలి : జిల్లా కలెక్టర్ నిశాంత్‌కుమార్**

మదనపల్లె, ఫిబ్రవరి 27 ప్రభాతవార్త :

దేశాభివృద్ధి ప్రణాళికలకు, ప్రభుత్వ విధానపరమైన అంశాలన్నింటికి జనగణన గణాంకాలే బలమైన పునాది లాంటివని జిల్లా కలెక్టర్ నిశాంత్‌కుమార్ పేర్కొన్నారు. శుక్రవారం పట్టణ సమీపంలోని ఆదిత్య ఇంజనీరింగ్ కళాశాలలో జిల్లా, చార్జ్‌స్థాయి అధికారులకు, జనగణన దశ-1, గృహజాబితా, గృహ గణనపై నిర్వహించిన శిక్షణా కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ముఖ్య అతిధిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జనగణన ప్రక్రియలో ఖచ్చితమైన, సమగ్రమైన, పారదర్శకత సమాచారం సేకరణ ద్వారా ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలకు స్పష్టమైన దిశ, నిర్దేశం లభిస్తుందన్నారు. ప్రతి అధికారి బాధ్యతగా వ్యవహరించి ఇంటింటి సమాచారాన్ని ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం నమోదు చేయాలని ఆదేశించారు. సేకరించిన గణాంకాల ఆధారంగానే విద్య, వైద్యం, ఉపాధి, గృహనిర్మాణం, మౌళిక వసతుల ప్రణాళికలు రూపొందించుకొంటాయన్నారు. ఆర్థిక సంఘాల నివేదికలు, రాష్ట్రానికి ఇచ్చే నిధులు వాటి అంశాలు కూడా జనగణ గణాంకాలపై ఆదారపడి ఉంటాయన్నారు. జనగణన గణాంకాల ఆధారంగా నియోజకవర్గాల పునర్విభజన ఎమ్మెల్యే, ఎంపి స్థానాలను నిర్ణయం జరుగుతుందన్నారు. సంక్షేమ పథకాల రూపకల్పన వ్యవసాయ భూములు విస్తీర్ణం, పారిశ్రామిక ఆస్తుల పన్నులు, నీటి వనరులు, పారిశుద్ధ్య సమస్యలు వంటి అంశాలపై ప్రభుత్వ విధానాల రూపకల్పనలో జనగణన కీలక పాత్ర పోషిస్తుందన్నారు. అధికారులు పొరపాట్లు చేయకుండా అప్రమత్తంగా పనులు చేయాలన్నారు. పదేళ్ళకొక్కొసారి జనగ్గణన నిర్వహించడం జరుగుతుందని గతంలో కోవిడ్ కారణంగా వాయిదా పడిందిని మళ్లీ సెన్సస్‌కు సంబంధించి అన్ని కార్యాచరణలు ప్రారంభించబడ్డాయన్నారు. ఈ శిక్షణ కార్యక్రమంలో మదనపల్లె సబ్‌కలెక్టర్ చల్లా కళ్యాణి, డిఆర్ఓ మధుసూదన్‌రావు, రాయచోటి, పీలేరు ఆర్డీఓ శ్రీనివాస్, ఏడి సర్వేయర్ భరత్‌కుమార్, డిపిఓ రాధమ్మ, లక్ష్మీపతి, తహశీల్దార్లు, ఎంపిడిఓలు, మున్సిపల్ కమిషనర్‌లు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్

## వైభవంగా ప్రారంభమైన బ్రహ్మోత్సవాలు

రామసముద్రం, ఫిబ్రవరి 27 ప్రభాతవార్త

రామసముద్రం మండలం చంబకూరు గ్రామపంచాయతీలో గట్టుపై వెలసిన శ్రీ గట్టు వెంకటేశ్వర స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు శుక్రవారం అంకురార్పణతో ఘనంగా కార్యనిర్వాహకులు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో భాగంగా శనివారం ధ్వజారోహణం సూర్య ప్రభోత్సవం, ఆదివారం సింహ వాహనం, సోమవారం శేష వాహనం, హనుమంత వాహనం, బుధవారం గజవాహనం, గురువారం కళ్యాణోత్సవం, గరుడోత్సవం, శుక్రవారం రథోత్సవం, శనివారం దీపోత్సవం, ఆదివారం వసంతోత్సవం ద్వజారోహణం, సోమవారం పుష్ప పల్లకి సేవ, మంగళవారం శయనోత్సవం వంటి కార్యక్రమముతో అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నట్లు కార్యనిర్వాహకులు తెలియజేశారు. కావున ప్రజలందరూ స్వామివారి సేవలో పాల్గొని స్వామి వారి కృపకు పాత్రులు కావాలని వారు తెలియజేశారు.



## బాల్య వివాహం ఒక సామాజిక అనర్థం



సదుం ఫిబ్రవరి 27 ప్రభాతవార్త

బాల్య వివాహం అనేది ఒక సామాజిక అనర్థం అని ఐసిడిఎస్ సూపర్వైజర్ బి మల్లీశ్వరి అన్నారు. శుక్రవారం బూరగమంద జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో యుక్త వయసు బాలికలకు చేపట్టిన"బాల్ వివాహ్ ముక్తి రథ్" కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న 100 రోజుల సుదీర్ఘ ప్రచార కార్యక్రమంలో భాగంగా ఈ కార్యక్రమం జరుగుతోందని చెప్పారు. గుడ్‌టచ్ బ్యాడ్‌టచ్ గురించి వివరించారు. అత్యవసరమైనప్పుడు 10 98 నెంబర్ కి ఫోన్ కాల్ చేయవచ్చునని సూచనలు చేశారు. బాల్య వివాహం ఒక సామాజిక అనర్థం మాత్రమే కాదు, అది బాలల భవిష్యత్తును దెబ్బతీసే తీవ్రమైన సమస్య. ప్రతి బాలికకు విద్య, ఆరోగ్యం, భద్రత కల్పించడం మనందరి బాధ్యత. 2030 నాటికి బాల్య వివాహాలను పూర్తిగా నిర్మూలించాలనే జాతీయ లక్ష్యానికి అనుగుణంగా ఇలాంటి అవగాహన కార్యక్రమాలు అత్యంత అవసరం అని వివరించారు. కార్యక్రమంలో ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు అఫ్జల్ హుస్సేన్, కరీముల్లా షా అంగన్వాడి కార్యకర్తలు నిర్మల, వసంతకుమారి, అమృత తదితరులు పాల్గొన్నారు.

## స్వచ్ఛమైన పాలు ఆరోగ్యానికి మేలు



ఒంటిమిట్ట ఫిబ్రవరి.26 ప్రభాతవార్త

ఒంటిమిట్ట మండల కేంద్రంలో ఉన్న పశువైద్యశాలను శుక్రవారం క్షేత్రస్థాయి పశు వైద్య అధికారి ఎన్ ఏ శ్రీనివాసులు తనిఖీ చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన కార్యాలయంలోని పలు రికార్డులను, వైద్యం నిమిత్తం జంతువులకు అవసరమయ్యే నిల్వ ఉంచిన మందులను తనిఖీ చేయడం జరిగింది. అనంతరం ఒంటిమిట్ట మండలం కొత్త మాధవరం గ్రామంలోని పాలను నిల్వ ఉంచు కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన పాల కేంద్రంలోని సిబ్బందితో మాట్లాడుతూ నిల్వ పాలను పరిరక్షించాలన్నాడు. పాలు ప్రతి ఒక్కరికి అవసరమేనని ముఖ్యంగా చిన్నపిల్లలకు అవసరమని పరిశుభ్రమైన వాతావరణంలో జాగ్రత్తగా నిల్వ ఉంచాలన్నాడు. స్వచ్ఛమైన పాలు ఆరోగ్యానికి ఎంతో మేలు అన్నాడు. ప్రాణాన్ని కాపాడే పాలు కలుషితం కాకుండా చూడాల్సిన బాధ్యత అందరి పైన ఉందన్నాడు. పాలల్లో నీళ్లు కలిపితే కొలత పెరుగుతుంది కానీ పోషక విలువలు దూరమవుతాయన్నాడు. పోషక విలువలు లేని పాలు నిరుపయోగమన్నాడు. ఈ కార్యక్రమంలో ఒంటిమిట్ట పశుసంవర్ధక శాఖ సహాయసంచాలకురాలు వై. ఉమా, డాక్టర్ స్వాతి, లక్ష్మి,మణి, రామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి ఇంటా ఫ్రై డేని డ్రై డేగా పాటించాలి

రాయచోటి ఫిబ్రవరి 27 ప్రభాతవార్త

ప్రతి ఇంట ఫ్రైడే ని డ్రైడేగ పాటించాలి అని హెల్త్ అసిస్టెంట్ ఎర్రపురెడ్డి విశ్వనాథరెడ్డి ప్రజలను కోరారు. జాతీయ కీటకజనిత వ్యాధి నియంత్రణపై అవగాహన కార్యక్రమంలో భాగంగా ఆయన ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి ఇంటా ఫ్రై డేని డ్రై డేగా పాటించాలని శుక్రవారం చెన్నముక్కపల్లె2 గ్రామ సచివాలయం పరిధిలోని రాజుల కాలనీలోని మోడల్ ప్రైమరీ స్కూల్ నందు విద్యార్థులకు దోమల లార్వాను చూపించి జాతీయ కీటకజనిత వ్యాధి నియంత్రణపై అవగాహన కార్యక్రమాన్ని ఆరోగ్య సిబ్బందితో ఆయన డెంగ్యూ వ్యాధిని నివారించుటకు తీసుకోవల్సిన జాగ్రత్తలు గురించి అక్కడి ప్రజలకు విద్యార్థులకు వివరించారు. ముఖ్యంగా ఇంటిలో వున్న నీటి నిల్వలు మీద దోమలు గ్రుడ్లు పెట్ట కుండ మూతలు ఉంచాలని, ఇంటి పరిసరాలలో త్రాగి వదిలేసిన కొబ్బరి బోండాలు, పాత టైర్లు, ఖాళీ డబ్బాలు రాతి రుబ్బు రోళ్ళు, పనికి రాని ఎయిర్ కూలర్స్ పరిసరాలలో ఉంచకుండ చూడవలెనని తెలిపారు. దోమలు గదుల యందు చీకటి ప్రదేశములలో వ్రేలాడ బడు వస్తువుల మీద వుండునని, కావున ఆ వ్రేలాడే వస్తువులు ఉండ కుండ చూడవలెనని తెలిపారు.దోమలు ఇంటిలోనికి రాకుండ కిటికీలకు, తలుపులకు జాలీలు బిగించుకోవలెనని, దోమలు కుట్టకుండా పైన తెలిపిన జాగ్రత్తలు తీసుకోవాలని, డ్రైనెజ్ కాల్వల్లో అడ్డుగా వున్న వాటిని తొలగించి నీరు నిల్వ వుండకుండ నిరంతరం పారేటట్లు చూడాలని, ప్రతి శుక్రవారము డ్రై డేగా పాటిద్దామని, డెంగ్యూ,చికున్ గున్యా, మలేరియా జ్వరాల నుండి రక్షణ పొందుదామని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో చెన్నముక్కపల్లె2 విలేజ్ హెల్త్ సెంటర్ సిహెచ్ఓ షేక్ కొలిమి ఆజ్మీయా, పాఠశాల ప్రధానోపాధ్యాయులు జి.వీర నాగయ్య, ఉపాధ్యాయులు ఎ.నరేంద్ర, ఆశా కార్యకర్తలు కె.సునంద, ఎ.ఉమాదేవి తదితరులు పాల్గొన్నారు.



## నిబంధనలు పాటించి తీరాల్సిందే

బి కొత్తకోట ఫిబ్రవరి 27 ప్రభాతవార్త :



వాహన చోదకులు రోడ్డు భద్రత నియమ నిబంధనలు కచ్చితంగా పాటించి తీరాల్సిందేనని బి కొత్తకోట సర్కిల్ ఇన్స్పెక్టర్ గోపాల్ రెడ్డి హెచ్చరించారు. శుక్రవారం ఆయన బి.కొత్తకోటలో వాహన చోదకులకు పలు సూచనలు సలహాలు చేశారు. వాహన చోదకులు హెల్మెట్ కచ్చితంగా ధరించాలని, మద్యం సేవించి బండి నడపరాదని, సెల్‌ఫోన్ మాట్లాడుతూ వాహనం నడపరాదని, అతివేగం పనికిరాదని, పరిమితికి మించి వెళ్ళరాదని, డ్రైవింగ్ లైసెన్స్ తో పాటు వాహన ఒరిజినల్ రికార్డులు కచ్చితంగా తమ వద్ద ఉంచుకోవాలని, మైనర్లకు వాహనాలు ఇవ్వరాదని, ట్రాఫిక్ రూల్స్ కచ్చితంగా పాటించి తమతో పాటు ఇతరులకు ఇబ్బందులు లేకుండా వాహనం నడపి క్షేమంగా ఇండ్లకు చేరాలని సూచనలు చేశారు. ఎవరైనా రోడ్డు భద్రత సూచనలు పాటించకపోతే వాహనాలు సీజ్ చేసి జరిమానాలతో పాటు కేసులు నమోదు చేసి కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు. ఆయన వెంట పోలీసులు, వాహన చోదకులు ఉన్నారు.

## తాగునీటి సమస్యను పరిష్కరించాలి



లక్కిరెడ్డిపల్లి : ఫిబ్రవరి 27 ప్రభాతవార్త

మండల పరిధిలోని అనంతపురం గ్రామంలోని దళితవాడలో తీవ్రమైన తాగునీటి సమస్య నెలకొన్నదని సిపిఐ మండల కార్యదర్శి కొమ్ము ఓబులేసు అన్నారు. శుక్రవారం దళితవాడలోని మహిళలతో కలిసి కాళీ బిందెలతో నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోజులో ఒక 10 నిమిషాలు మాత్రమే నీటి సరఫరా జరుగుతుండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మహిళలు, వృద్ధులు, చిన్నపిల్లలు గంటల తరబడి బిందెలతో నీటి కోసం ఎదురు చూడాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఉన్న బోరులో సక్రమంగా నీరు రాక, కరెంటు సదుపాయం లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా స్థానిక ప్రజాప్రతినిధులు మరియు అధికారులు స్పందించి ప్రజలకు తాగునీరు అందించడం ప్రభుత్వపు ప్రాథమిక బాధ్యతని గుర్తించి వెంటనే శాశ్వత పరిష్కారం చూపాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మంద కృష్ణయ్య, నరేష్, ఇందిరమ్మ, నాగమ్మ, ఓబులేసు, తదితరులు పాల్గొన్నారు.

## క్షయ రహిత జిల్లాగా మార్చడమే లక్ష్యం

**జిల్లా టీబీ అధికారిణి డాక్టర్ రాధిక**



మదనపల్లె క్రైమ్, ఫిబ్రవరి 27 ప్రభాతవార్త.

అన్నమయ్య జిల్లాను క్షయ రహిత జిల్లాగా మాత్రమే లక్ష్యంగా పెట్టుకుని పని చేస్తున్నామని జిల్లా టిబి అధికారిని డాక్టర్ రాధిక తెలిపారు. శుక్రవారం జాతీయ క్షయ నిర్మూలన కార్యక్రమం లో భాగంగా అమలవుతున్న టీబీ ముక్త్ పంచాయతీ కార్యక్రమంపై రికార్డుల పరిశీలన నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ రాధిక మాట్లాడుతూ మదనపల్లె, వాయల్పాడు టీబీ యూనిట్ల పరిధిలోని ఎంపిక చేసిన గ్రామ పంచాయతీలను ప్రోగ్రామ్ ఆఫీసర్లు డాక్టర్ రమేష్ బాబు, డాక్టర్ శ్రీధర్లతో కలిసి తనిఖీలు చేయడం జరిగిందన్నారు. జిల్లాలో టీబీ ముక్త్ పంచాయతీ కార్యక్రమాన్ని సమర్ధవంతంగా అమలు చేస్తున్నామన్నారు. డేటా నాణ్యతను మెరుగుపరచడం, ఎక్కడైనా లోపాలు ఉంటే తక్షణమే సరిదిద్దడమే ఈ తనిఖీల ప్రధాన లక్ష్యం అన్నారు. జిల్లాను క్షయ రహితంగా మార్చేందుకు ఆరోగ్య శాఖ పూర్తి స్థాయిలో కృషి చేస్తోందన్నారు. కేవలం రికార్డులకే పరిమితం కాకుండా, అధికారులు టీబీ రోగులతో నేరుగా, టెలిఫోన్ ద్వారా మాట్లాడి, వైద్య సేవలు, మందుల వినియోగం, నిక్షయ్ పోషణ యోజన ద్వారా అందుతున్న ఆర్థిక సాయంపై ఆరా తీయటం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా టీబీ సూపర్ వైజర్ శ్రీనివాసులు, ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ చెన్నారెడ్డి, మదనపల్లె, వాయల్పాడు టీబీ యూనిట్ల సిబ్బంది, మిడ్ లెవల్ హెల్త్ వర్కర్లు, ఆరోగ్య కార్యకర్తలు, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

# విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తు కోసం అడుగులు

పులివెందుల, ఫిబ్రవరి 27, ప్రభాతవార్త :

విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తు దిశగా పులివెందుల నియోజకవర్గంలో పదో తరగతి వార్షిక పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించేందుకు నియోజకవర్గంలోని 52 ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న 2,378 మంది విద్యార్థులకు పరీక్షా సామాగ్రినీ శాసనమండలి సభ్యులు భూమిరెడ్డి రామగోపాల్ రెడ్డి ఆశయాలకు అనుగుణంగా, వారి సతీమణి భూమిరెడ్డి ఉమాదేవి శుక్రవారం పులివెందుల మున్సిపాలిటీతో పాటు వేముల, తొండూరు మండలాలలోని ప్రభుత్వ పాఠశాలలను సందర్శించి విద్యార్థులకు ప్యాడ్లు, పెన్నులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఉమాదేవి మాట్లాడుతూ మంత్రి లోకేష్ విద్యా వ్యవస్థలో విప్లవాత్మక మార్పులు తీసుకువస్తు న్నారని కొనియాడారు. ముఖ్యంగా డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం" ద్వారా విద్యార్థులకు పౌష్టికాహారం అందించడమే కాకుండా, సెంట్రల్ కిచెన్స్ వంటి ఆధునిక సదుపాయాలతో పాఠశాలల రూపురేఖలను మెరుగుపరుస్తున్నారని తెలిపారు. ప్రతి పేద విద్యార్థి ఉన్నత చదువులు అభ్యసించాలన్నదే ప్రభుత్వ లక్ష్యమన్నారు. విద్యార్థుల్లో పోటీ తత్వాన్ని పెంపొందించేందుకు ప్రత్యేక ప్రోత్సాహకంగా, రాబోయే పదవ తరగతి పరీక్షల్లో నియోజకవర్గంలోని 52 పాఠశాలల నుంచి ఉత్తమ ఫలితాలు సాధించి మొదటి మూడు స్థానాల్లో నిలిచిన విద్యార్థులకు ..10,000 నగదు బహుమతి అందజేస్తామని శ్రీమతి ఉమాదేవి ప్రకటించారు. విద్యార్థులు ఎటువంటి ఒత్తిడి లేకుండా పరీక్షలు రాసి ఉన్నత శిఖరాలను అధిరోహించాలనీ ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకుని పులివెందుల పేరు ప్రతిష్ఠలను నిలబెట్టాలి అని ఆమె ఆకాంక్షించారు. మాజీ కడప పార్లమెంట్ కార్యదర్శి బొజ్జా మైసూరా రెడ్డి వేముల, తొండూరు మండలాల్లోని ప్రభుత్వ పాఠశాలలను సందర్శించి విద్యార్థులకు పరీక్షా సామాగ్రి పంపిణీ చేశారు. శాసనమండలి సభ్యులు శ్రీ భూమిరెడ్డి రామగోపాల్ రెడ్డి ఆదేశాల మేరకు నియోజకవర్గంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి విద్యార్థులకు ఉచితంగా ప్యాడ్లు, పెన్నులు పంపిణీ చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కొమ్మ శివశంకర్, తాళ్లపల్లి వెంకటేశ్వర రెడ్డి సుధీర్ రెడ్డి తదితరులు పాల్గొని విద్యార్థులను అభినందించారు.



విద్యార్థులతో ఎమ్మెల్సీ సతీమణి ఉమాదేవి

## ఉపాధి అవకాశాలు కల్పించడమే లక్ష్యం



ప్రొద్దుటూరు ఫిబ్రవరి 27 ప్రభాతవార్త

ఉభయ తెలుగు రాష్ట్రాలలో నిరుద్యోగ యువతీ యువకులకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించడమే స్వామి వివేకానంద ఇన్స్టిట్యూషన్స్ అండ్ యోగా ఫౌండేషన్ లక్ష్యమని ఛైర్పర్సన్ తేజస్విని రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక గౌతమి మహిళా ఇంజనీరింగ్ కళాశాల మరియు స్వామి వివేకానంద ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన మెగా జాబ్ మేళాలో ఆమె పాల్గొన్నారు ఈ సందర్భంగా ఆమె మీడియాతో మాట్లాడుతూ స్వామి వివేకానంద ఇన్స్టిట్యూషన్స్ అండ్ యోగ ఫౌండేషన్ ద్వారా పలు రకాలుగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని అందులో భాగంగా కెరియర్ సెక్టార్ కింద ఎంతోకాలంగా తెలుగు రాష్ట్రాలలో నిరుద్యోగ యువతీ యువకులకు మెగా జాబ్ డ్రైవ్ నిర్వహించామని తెలిపారు. దీనికి సహకరించిన కళాశాల డైరెక్టర్లు నాగూరు, శైలుషకి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు అడిగిన తక్షణమే అన్ని ఏర్పాట్లు చేసిన యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయా కంపెనీల ప్రతినిధులకు ఆమె ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ జాబ్ మేళాకు నిరుద్యోగ యువతీ యువకులు సుమారు 700కు పైగా పాల్గొనగా 256 మంది పలు ఉద్యోగాలకు ఎందుకైనట్లు కళాశాల ప్లేస్మెంట్ ఇంచార్జ్ సురేంద్రనాయుడు తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం రామసుబ్బమ్మ స్వామి వివేకానంద ఇన్స్టిట్యూట్ అండ్ యోగ ఫౌండేషన్ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి క్యాంపస్ డైరెక్టర్ గణేష్ కోఆర్డినేటర్ మునిశేఖర్ రెడ్డి చీఫ్ గెస్ట్ ఇంద్రమ్మ వైజాగ్ హెడ్ సూర్య మరియు డిప్లమా ప్రిన్సిపల్ ప్రకాశరావు మరియు వివిధ విభాగ అధిపతులు నిరుద్యోగ యువతీ యువకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## రూ.11 కోట్లతో మండలంలో అబివృద్ధి పనులు

గాలివీడు, ఫిబ్రవరి 27(ప్రభాతవార్త):

గాలివీడు మండలంలో 11 కోట్ల రూపాయలతో వివిధ రకాల అబివృద్ధి పనులు చేపట్టామని రాయచోటి నియోజకవర్గ టీడీపీ నాయకుడు మండిపల్లి లక్ష్మీప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం గాలివీడు మండల కేంద్రంలోని కదిరి ప్రధాన రహదారి నుంచి గంగమ్మ దేవాలయం ద్వారా ప్రభుత్వాసుపత్రి వరకు రూ.45 లక్షల వ్యయంతో ఏర్పాటు చేయనున్న సిమెంట్ రోడ్డు పనులను ప్రారంబించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ర్పబుత్వం అధికారంలోకి వచ్చిన సంవత్సరం లోపలే 10 కోట్లకు పైన వివిధ రకాల అబివృద్ధి పనులను చేపట్టడం జరిగిందన్నారు. గత వేసవి కాలంలోమంచి నీటి ఎద్దడి నివారణకు ప్రతి పల్లెలో తాగునీటి బోర్లు వేసి తాగునీటి సమస్య లేకుండా తీర్చామన్నారు. గ్రామాల్లో మౌలిక సదుపాయాలు కల్పనకు డ్రైనేజీ సిమెంట్ రోడ్ల లింకు రోడ్లను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. హంద్రీనీవా నుంచి వెలిగల్లు ప్రాజెక్టుకు నీల్లు రావడం మంచి ఆనందించగ్గ విషయమన్నారు. ప్రతి గ్రామంలో మౌలిక సదుపాయాలు కల్పనకు మరింత కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు పురం కుమార్‌రెడ్డి, మాజీ సర్పంచులు మహమ్మద్ రియాజ్, భద్రప్పనాయుడు, మార్కెట్ కమిటీ వైస్‌ఛైర్మన్ మల్లిఖార్జున, మాజీ ఎంపీటీసీలు చిన్నరెడ్డి, ప్రబాకర్‌నాయుడు, రెడ్డిప్రసాద్‌రెడ్డి, మాజీ వక్ఫ్ బోర్డు మెంబర్ మహబూబ్‌బాషా, టీడీపీ నాయకులు శ్రీకాంత్‌రెడ్డి, ఉదయ్‌కుమార్, నరసారెడ్డి, నాగేశ్వరరావు, సూరి, ఏఎంసీ ఛైర్మన్లు ప్రబాకర్‌రెడ్డి, శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## దేశ స్వాతంత్ర్యం, మన సమాజ స్థాపనే లక్ష్యం



పెండ్లిమర్రి, ఫిబ్రవరి 27, ప్రభాతవార్త:

తన ఆత్మ బలిదానంతో స్వాతంత్ర్య కాంక్షను రగిల్చిన విప్లవ వీరుడు, బ్రిటీషర్లపైకి ఎగిసిన విప్లవ కెరటం, స్వాతంత్ర్య పోరాటంలో ఉవ్వెత్తున ఎగిసిన ఉద్యమకారుడు విప్లవధీరుడు చంద్రశేఖర్ ఆజాద్ అని ఆర్ఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు డీఎం ఓబులేసు యాదవ్ కొనియాడారు. స్థానిక నర్సింగ్ కళాశాలలో ఆజాద్ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆజాద్ అలారాజ్‌పూర్ స్థానంలోని భాబ్రా గ్రామంలో పండిట్ సీతారామ్ తివారి, జగరాణిదేవాలకు జన్మించారు. దేశం గర్వించదగ్గ స్వాతంత్ర్యం ఉద్యమకారుల్లో ఒకడని ఆయన 1931 ఫిబ్రవరి 27వ తేదీ ఉదయం పోలీసు బలగాలు గుళ్ల వర్షం కురిపిస్తుండగా ఆజాద్ తన రివాల్వర్‌తో శత్రువులను చెండాడుతూ పోరాటం సాగించాడు. ఆయన స్వాతంత్ర్యం కోసం చేసిన పోరాటాలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి రెడ్డిసాయి, నగర అధ్యక్షులు బాల సుందరం, కళాశాల యాజమాన్యం, విద్యార్థినిలు పాల్గొన్నారు.

## ట్రాఫిక్ సమస్యల నివారణకు చర్యలు



వేంపల్లె ఫిబ్రవరి 27 ప్రభాతవార్త

ట్రాఫిక్ కు అంతరాయం లేకుండా దుకాణాదారులు వ్యాపారం చేసుకోవాలని సీఐ టి.నరసింహులు తెలిపారు. పులివెందుల రోడ్డు నుంచి కడప రోడ్డు వరకు రోడ్డు వెడల్పు కారణంగా రోడ్డు పనులు చేపడుతుండటంతో వాహనదారులు, పాదచారులు ట్రాఫిక్ సమస్యతో ఇబ్బందులకు గురవుతున్నారు. శుక్రవారం సిఐ నరసింహులు తన సిబ్బందితో కలిసి ట్రాఫిక్ సమస్యను పర్యవేక్షించారు. దుకాణాదారులు, తోపుడు బండ్ల వ్యాపారులు ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా వ్యాపారాలు చేసుకోవాలని దుకాణాదారులకు సూచించారు. తోపుడు బండ్ల వ్యాపారులు రోడ్డు పైన ఎక్కడ పడితే అక్కడ నిలపడం వల్ల ట్రాఫిక్ సమస్య ఏర్పడుతోందన్నారు. ట్రాఫిక్ సమస్య లేని చోట తోపుడు బండ్లు ఉంచి వ్యాపారం నిర్వహించుకోవాలని సూచించారు. అదేవిధంగా వాహనదారులు ట్రాఫిక్ నియమాలు పాటిస్తూ, ఓర్పుతో ప్రయాణించాలని కోరారు. రోడ్డు పనులు పూర్తయ్యే వరకు అందరూ సహకరిస్తేనే ట్రాఫిక్ సమస్యను సమర్థవంతంగా నియంత్రించవచ్చని సీఐ తెలిపారు. ప్రజల సహకారంతో పట్టణంలో సాఫీగా రాకపోకలు సాగేందుకు పోలీస్ శాఖ నిరంతరం చర్యలు తీసుకుంటుందని సీఐ టి.నరసింహులు స్పష్టం చేశారు.

## అంగరంగ వైభవంగా విగ్రహాల ప్రతిష్ట

తంబళ్లపల్లి ఫిబ్రవరి 27 ప్రభాతవార్త ః

మల్లయ్య కొండలో శుక్రవారం ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్ రెడ్డి, కవితమ్మల ఆధ్వర్యంలో ముగ్గురు దేవతల విగ్రహ ప్రతిష్ట కార్యక్రమాలు వైభవంగా జరిగాయి. ఉదయం మహ శివునికి అర్చనలు, అభిషేకాలు, ధూప దీప నైవేద్యాలు అర్చకులు ఈశ్వరప్ప, మల్లికార్జునస్వామిలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించి ఎమ్మెల్యే దంపతులకు తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే దంపతులు తొలుత వెలుగు మల్లమ్మ నూతన ఆలయంలో అమ్మవారి విగ్రహ ప్రతిష్ట, అనంతరం కొండకింద మదాతం బావి వద్ద వినాయక ఆలయం, ఆంజనేయస్వామి ఆలయాలలో స్వామివారుల విగ్రహాల ప్రతిష్ట కార్యక్రమాలు సదుంకు చెందిన ప్రధాన అర్చకులు రఘు, వేణు స్వాముల అర్చకత్వంలో జనవాహిని మధ్య కన్నుల పండుగ జరిగాయి. మంగళ వాయిద్యాలు, మంత్రోచ్చారణల మధ్య గణపతి పూజ, నవగ్రహాల పూజ, వాస్తు పూజ, జలాధివాసం, దాన్యాధివాసం, హోమం, యంత్ర ప్రతిష్ట అనంతరం దేవత మూర్తుల విగ్రహాలకు ప్రాణ ప్రతిష్ట కార్యక్రమాలు నియమ నిష్టలతో నిర్వహించారు. ఈ విగ్రహ ప్రతిష్ట కార్యక్రమాలకు వందలాదిగా భక్తులు, ప్రజలు, నాయకులు పెద్ద ఎత్తున హాజరై స్వామివారి నూతన విగ్రహాలకు ప్రత్యేక పూజలు నిర్వహించి కార్యక్రమాలు కనులారా వీక్షించి ఆస్వాదించారు.



## విద్యార్థులు ఉన్నత శిఖరాలకు చేరుకోవాలి

రామసముద్రం పిబ్రవరి 27 ప్రభాతవార్త

ప్రభుత్వ పాఠశాలలో పదవ తరగతి విద్యార్థులకు జరగబోవు పరీక్షలలో ఉత్తమ ఫలితాలు సాధించి పాఠశాలకు మంచి పేరు తేవాలని ఎంఈఓ 2ఆంజనేయులు, హెచ్ఎం చిట్టిబాబు సూచించారు. మండలకేంద్రంలోని ప్రభుత్వ జడ్పీ జడ్పీ హైస్కూల్లో వార్షికోత్సవ వేడుకలు హెచ్ఎం ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. ఈ వేడుకలకు ముఖ్య అతిధులుగా ఎం ఈ వో 2ఆంజనేయులు, చొక్కాండ్లపల్లె హెచ్ఎం శ్రీనివాసులు సందీప్, స్కూల్ వైస్‌ఛైర్మన్ రమణమ్మలను స్వాగతం పలికారు. జ్యోతి ప్రజ్వలన చేసి ఈ వేడుకలను ప్రారంభించారు పాఠశాల ఆవరణాన్ని పచ్చని తోరణాలు, పలు రకాల పుష్పాలతో అలంకరణ చేశారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన ప్రముఖులు మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో విద్యను అభ్యసించి మంచి విజయాలు సాధించాలన్నారు. రేపటి భవిష్యత్తు కోసం విద్యార్థులు యొక్క జీవితప్రయాణాన్ని ఎలా ముందుకు తీసుకు పోవాలో ఉపాధ్యాయులు విద్యార్థుల కు దిశానిర్దేశం చేయడం జరిగింది. పదవ తరగతి విద్యార్థులు సమయపాలనతో చదువుతూ మంచి ఉత్తీర్ణత శాతం సాధించాలన్నారు. పదవతరగతి పరీక్షలు రాసే విద్యార్థులకు పూర్వ విద్యార్థులు పరీక్ష సామగ్రిని పంపిణీ చేశారు.



# నూతన ట్రాన్స్ పార్మర్ ప్రారంభించిన రితేష్ రెడ్డి

బద్వేలు, ఫిబ్రవరి 27, ప్రభాతవార్త

మున్సిపాలిటీ పరిధిలోని శివానగర్‌లో నూతనంగా నిర్మించిన అదనపు ట్రాన్స్‌ఫార్మర్‌ను టిడిపి యువనేత రితేష్ రెడ్డి శుక్రవారం ప్రారంభించారు. రాబోయే ఎండాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని స్థానిక ప్రజలకు విద్యుత్ అంతరాయాలు కలగకుండా, లోవోల్టేజ్ సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యగా ఈ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. రిబ్బన్ కట్ చేసి ట్రాన్స్‌ఫార్మర్‌ను ప్రారంభించిన అనంతరం స్థానికులతో ముచ్చటించి, వారి సమస్యలను తెలుసుకున్నారు. నియోజకవర్గంలో మౌలిక వసతుల అభివృద్ధికే ప్రథమ ప్రాధాన్యత ఇస్తున్నామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపాలిటీ టిడిపి అధ్యక్షులు వెంగళరెడ్డి, కొర్రపాటి సురేంద్ర, సింగసాని బుజ్జి, సింగరయ్య పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

